www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా...
ఆదివారం 10 - 8 - 2025 సంపుటి : 1 సంచిక : 34 పేజీలు : 12 వెల : 5/- తెలంగాణ/ఆంధ్రప్రదేశ్


V3 NEWS
డా॥ కాచం సత్యనారాయణ
CMD




334 రాజకీయ
## పార్టీలపై వేటు

- ఒక్క ఎన్నికలోనూ బరిలోకి దిగకపోవడంతో
- ఈసీ కీలక నిర్ణయం..
- దేశంలో ఆరు జాతీయ పార్టీలు 67 ప్రాంతీయ రాజకీయ పార్టీలు...

2లో...

బహుళ ప్రయోజనాలుండేలా
# మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్
అత్యంత అధునాతనంగా నిర్మించాలి

- తాగు నీటితో పాటు వరద నీటి నిర్వహణకు వీలుగా ఉండాలి
- గేట్ వే ఆఫ్ హైదరాబాద్‌గా గాంధీ సరోవర్ ప్రాంతం..
- అక్కడ నిర్మించే ఐకానిక్ టవర్ ప్రపంచంలోనే ఎత్తైన టవర్‌గా నిర్మించాలి
- రెండు నెలల్లో టెండర్లు పిలిచేందుకు వీలుగా పనుల వేగం పెంచాలి
- అధికారులకు రేవంత్ రెడ్డి ఆదేశాలు




2లో...



## ప్రధానికి రాఖీ కట్టిన చిన్నారులు
వారితో కొంతసేపు సరదాగా ముచ్చటించిన మోడీ..

విశ్వంభర,నేషనల్ బ్యూరో: ప్రధాని నరేంద్రమోడీ రక్షా బంధన్ వేడుకలను విద్యార్థులు, ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారి సభ్యులతో కలిసి జరుపుకొన్నారు. ఢిల్లీలోని ప్రధాని నివాసంలో శనివారం ఉదయం 7 గంటల సమయంలో పలువురు విద్యార్థులు, బ్రహ్మకుమారి సభ్యులు మోడీకి రాఖీ కట్టారు. అనంతరం మోడీ వారితో కొంతసేపు సరదాగా ముచ్చటించారు. ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. గతేడాది కూడా ప్రధాని ఇలాగే స్కూల్ విద్యార్థినులతో రాఖీ కట్టించుకున్న సంగతి తెలిసిందే. అంతకుముందు రాఖీ పండుగను పురస్కరించుకొని దేశ ప్రజలకు మోడీ శుభాకాంక్షలు తెలియజేశారు. "సోదర సోదరీమణుల మధ్య అపరిమిత ప్రేమకు ప్రతీక ఈ రక్షా బంధన్. ఈ పండుగ మీ బంధాలను మరింత తీపికరంగా చేయాలని, ఆప్యాయత, సామరస్య భావాలను బలోపేతం చేయాలని, ప్రజంతా ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా" అంటూ మోడీ ఎక్స్‌లో పోస్టు చేశారు.

భారత రక్షణ రంగ ఉత్పత్తులు
# రూ.1.51 లక్షల కోట్లు



- 18శాతం వృద్ధి నమోదు చేసుకుంది
- అన్ని భాగస్వామ్యపక్షాల సమష్టి కృషి ఫలితంగా ఈ ఘనత
- ఆత్మనిర్భరత సాధిస్తుందనడానికి ఇదో నిదర్శనం
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్..

2లో...

స్వయం సహాయక సంఘాల్లో..
# ఇక బాలికలు

- 15-18 సంవత్సరాల బాలికలను సైతం సంఘాల్లో చేర్చుకునేలా ప్రణాళిక
- అరవై ఏళ్లు పైబడిన మహిళలు, దివ్యాంగులకు ప్రత్యేక సంఘాలు ఏర్పాటు
- కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరుగుతుంది....
- అధికారులు రోజువారీ పురోగతిని ఆన్ లైన్ పోర్టల్ లో నమోదు చేయాలి
- కార్యక్రమానికి డీఆర్డీడీఓలు, ఏపీఎంలు, సీసీలు మార్గదర్శకత్వం
- కొత్త సంఘాల ఏర్పాటు ఈ నెల మూడో వారంలోపు పూర్తి చేయాలి
- ఒక్కో సంఘంలో కనీసం 5 నుంచి గరిష్టంగా 20 మంది సభ్యులు ఉండవచ్చు
- మహిళలు, పురుషులు ఇద్దరూ సభ్యులుగా చేరవచ్చు
- మార్గదర్శకాలను విడుదల చేసిన సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్

2లో...




విశ్వంభర, తెలంగాణ బ్యూరో: కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని ప్రభుత్వం చెబుతున్నది. ఇందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి మిషన్-2025లో కింద కోటి మంది మహిళలను స్వయం సహాయక బృందాల్లో చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నది. సంఘాల్లో చేరని మహిళలు, 15-18 సంవత్సరాల బాలికలను సైతం సంఘాల్లో చేర్చుకునేలా ప్రణాళిక రూపొందించింది. అంతేకాకుండా అరవై ఏళ్లు పైబడిన మహిళలు, దివ్యాంగులకు ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నది. ఈ సంఘాల ఏర్పాటు, పర్యవేక్షణకు సంబంధించిన మార్గదర్శకాలను ఇటీవల గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) సీఈఓ దివ్య దేవరాజన్ విడుదల చేశారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరుగుతుందని స్పష్టం చేశారు. రోజువారీ పురోగతిని ఆన్ లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమానికి డీఆర్డీడీఓలు, ఏపీఎంలు, సీసీలు మార్గదర్శకత్వం వహించనున్నారు....

# కేటీఆర్‌కు రాఖీ కట్టని కవిత..

కేటీఆర్ బెంగళూరులో ఉండటమే
ఇందుకు కారణమా..?

- కొన్నాళ్లుగా పార్టీ పరంగా నెలకొన్న విభేదాలు కారణంగా నిలిచాయా?
- రాజకీయ వర్గాల్లో మొదలైన చర్చ..!



2లో...




## మూడు విడతలుగా వేతనాలు పెంచుతాం
నిర్మాతల మండలి కీలక నిర్ణయం..

**విశ్వంభర, హైదరాబాద్:** సినీ కార్మికుల ఆందోళనపై నిర్మాతల మండలి కీలక నిర్ణయం తీసుకుంది. మూడువిడతలుగా వేతనాలు పెంచాలని నిర్ణయించారు. తొలి విడతలో 15 శాతం, రెండో విడతలో 5శాతం, మూడో విడతలో 5శాతం పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. కాగా, 30 శాతం వేతనాలు పెంచాలని గతకొన్ని రోజులుగా కార్మికులు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా దీనిపై నిర్మాతలు నిర్ణయం తీసుకోవడంతో వారికి భారీ ఊరట లభించినట్లయింది.

ఇదిలా ఉంటే.. ఈ అంశంపై మెగాస్టార్ చిరంజీవి ఆసక్తికర ట్వీట్ పెట్టారు. ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులమని చెప్పుకునే కొంత మందివ్యక్తులు, నేను వారిని కలిశానని అబద్ధపు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కార్మికుల 30 శాతం వేతన పెంపు వంటివారి డిమాండ్లను నెరవేరుస్తామని హామీఇచ్చినట్లు కొందరూ వ్యక్తులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు.

# ఏ జాతికైనా భాష గుర్తింపు
## భాష లేకపోతే జాతి మనుగడ ఉండదు..

- తెలుగు వాడిని అని చెప్పాలంటే భాష, సంస్కృతి నిలబడాలి
- భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రజలందరిపైనా ఉంది
- వేరేభాష నేర్చుకుంటే గొప్పవారవుతారనేది ప్రమాదకరమైన ధోరణి: జస్టిస్ ఎన్వీ రమణ
- జస్టిస్ ఎన్.వి. రమణకు మండలి వెంకటకృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం



2లో...

## సోలార్ విద్యుత్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలి

2లో...

- అన్ని జిల్లా కలెక్టరేట్ల పార్కింగ్, క్యాంటీన్ ప్లాన్లు పంపాలి
- సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాద్ నుంచి పంపిస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

గిరిజనుల అభివృద్ధితోనే
## రాష్ట్రాభివృద్ధి సాధ్యం

2లో...

- ఏజెన్సీ అంటే దేవుడు సృష్టించిన అద్భుతం
- మంచి మనసు ఉండే ప్రజలు ఇక్కడ ఉంటారు
- ఏజెన్సీప్రాంతాల్లో స్వచ్ఛమైన, అందమైన కొండలు దర్శనమిస్తాయి
- ఆదివాసీలంటే గుర్తొచ్చేది సహజ నైపుణ్యం, సామర్థ్యం
- ఏపీ సీఎం చంద్రబాబు

ఈనెల 13లోగా రైతు బీమాకు
# దరఖాస్తు చేసుకోవాలి




18 నుంచి 59 సంవత్సరాల వయస్సు ఉన్న రైతులకు అవకాశం
రాష్ట్రంలో కొత్త పట్టాదారు రైతులకు సూచించిన వ్యవసాయశాఖ

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలోని కొత్త పట్టాదారు రైతులు ఈనెల 13వ తేదీలోగా రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ పేర్కొంది. జూన్?5 వరకు పట్టాపాసు బుక్‌వచ్చినా, అంతకు ముందు బీమా చేసుకోని రైతులు చేసుకోవా లని తెలిపింది. కొత్త రైతులు దరఖాస్తు ఫారం, రైతు పట్టాదారుపా సు బుక్‌జీరాక్స్ కానీ ఎమ్మార్వోతో డిజిటల్‌సంతకం అయిన డిఎస్‌పేపర్, రైతు ఆదార్‌కార్డు, నామినీ ఆదార్‌కార్డులతో దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించారు. 14 ఆగస్టు 1966 నుంచి 14 ఆగస్టు 2007 మధ్యలో పుట్టిన రైతులు మాత్రమే బీమాకు అర్హులు. అదార్ కార్డులో 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయస్సు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచనలు చేసింది.

# భారత రక్షణ రంగ ఉత్పత్తులు రూ.1.51 లక్షల కోట్లు

## – రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** దేశీయంగా రక్షణ ఉత్పత్తులు ఇటీవల గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ ఉత్పత్తుల విలువ రూ.1,50,590 కోట్లకు చేరిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే 18శాతం వృద్ధి కనిపించగా.. ఐదేళ్లలోనే 90శాతం వృద్ధి నమోదైందని చెప్పారు."2024-25 ఆర్థిక సంవత్సరంలో రక్షణ ఉత్పత్తుల విలువ రూ.1.5లక్షల కోట్లకు చేరుకొని ఆల్‌టైమ్ రికార్డు సాధించింది. గతేడాది 1.27లక్షల కోట్లుగా ఉండగా.. ప్రస్తుతం 18శాతం వృద్ధి నమోదు చేసుకుంది. 2019-20లో రూ.79వేల కోట్లు విలువైన ఉత్పత్తులు నమోదు కాగా ఇప్పుడది 90శాతం పెరిగింది" అనిరాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. డీఆర్‌డీవో, రక్షణరంగ విభాగాలు సహా అన్ని భాగస్వామ్యపక్షాల సమష్టి కృషి ఫలితంగా ఈ ఘనత సాధ్యమైందన్నారు. మొత్తం ఉత్పత్తుల్లో డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్ (డీపీఎస్‌యూ)తో పాటు ఇతర పీఎస్‌యూలు 77శాతం తయారుచేయగా,మరో 33శాతంలో ప్రైవేటు రంగం పాత్ర ఉందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. రక్షణ పరికరాల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని మన దేశం తగ్గించుకొని, ఆత్మనిర్భరత సాధిస్తుందనడానికి ఇదో నిదర్శనమన్నారు. దేశ అవసరాలను తీర్చడమే కాకుండా, రక్షణ ఉత్పత్తుల ఎగుమతి సామర్థ్యం కూడా భారీగా పెరిగిందన్నారు.

# 334 రాజకీయ పార్టీలపై వేటు

**మొదటిపేజీ తరువాయి...**

విశ్వంభర, ఢిల్లీ: దేశంలో రాజకీయ పార్టీల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం సవరించింది. గుర్తింపు పొందని 334 రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగించింది. నిబంధనల ప్రకారం..ఈసీ వద్ద నమోదైన రాజకీయ పార్టీలు ఆరేళ్లలో కనీసం ఒక్క ఎన్నికలోనైనా పోటీ చేయాల్సి ఉంటుంది. అయితే,ఈ పార్టీలు 2019 నుంచి ఒక్క ఎన్నికలోనూ బరిలోకి దిగకపోవడంతో వాటిపై ఈసీ వేటు వేసింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 334 పార్టీలను జాబితానుంచి తొలగించినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. పేరుకు పార్టీలుపెట్టినప్పటికీ..వీటికి భౌతికంగా ఎలాంటి కార్యాల యాలు అందుబాటులో లేవని వెల్లడించింది. ఇప్పటివరకు దేశంలో 2,854 గుర్తింపుపొందని పార్టీలు ఈసీ వద్ద రిజిస్టర్ అయి ఉన్నాయి.

తాజా చర్యతో ఆ సంఖ్య 2,520కి తగ్గింది. ఎన్నికల సంఘం వద్ద ఉన్న డేటా ప్రకారం.. ప్రస్తుతం దేశంలో ఆరు జాతీయ పార్టీలుగా కొనసాగుతున్నాయి. 67ప్రాంతీయ రాజకీయ పార్టీలు మనుగడలో ఉన్నాయి. ఎన్నికల సంఘం డీలిస్ట్ చేసిన రాజకీయ పార్టీల జాబితాలో తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 18 పార్టీలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి 5, తెలంగాణ నుంచి 13 పార్టీలు ఉన్నాయి.

**ఆరు జాతీయ పార్టీలివే..**

- భారతీయ జనతా పార్టీ (బీజేపీ)
- ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సీ)
- కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) (సీపీఎం)
- బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)
- ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)
- నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్పీపీ)

# సోలార్ విద్యుత్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలి

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు..



**మొదటిపేజీ తరువాయి...**

**విశ్వంభర, గద్వాల:** సోలార్ విద్యుత్ ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ విధాన నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎంభట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్ ఓ ఎఫ్ ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల పార్కింగ్, క్యాంటీన్ ప్లాన్లు హైదరాబాద్ కు పంపాలని డిప్యూటీ సీఎం సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ కూడా ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాద్ నుంచి పంపిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు.గ్రామ పంచాయతీ బిల్డింగ్ మొదలుకొని సెక్రటేరియట్ వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలకు సంబంధించి కలెక్టర్లు వారం లోపు విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కార్యాలయానికి పంపాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

# గిరిజనులు అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

## - ఏపీ సీఎం చంద్రబాబు



**మొదటిపేజీ తరువాయి...**

**విశ్వంభర, లగిశపల్లి:** ఏజెన్సీ అంటే దేవుడు సృష్టించిన అద్భుతమని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మళ్లీ జన్మ ఉంటే ఇక్కడే పుట్టాలని అనుకుంటున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా చంద్రబాబు అల్లూరి జిల్లా లగిశపల్లిలో పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడా రు."ఏజెన్సీ ప్రాంతాల్లో స్వచ్ఛమైన, అందమైన కొండలు దర్శనమిస్తాయి. మంచి మనసు ఉండే ప్రజలు ఇక్కడ ఉంటారు. ఆదివాసీలంటే గుర్తొచ్చేది సహజ నైపుణ్యం, సామర్థ్యం. గిరిజనులు అభివృద్ధి చెందితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం. గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై మొదట దృష్టి సారించింది ఎన్టీఆర్. గిరిజనుల సంక్షేమం గిరిజన ప్రాంతాల అభివృద్ధే మా లక్ష్యం.

గిరిజన ప్రాంతాల్లో ఐటీడీఏలో ఐఏఎస్‌లను నియమించి ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. ఏడు ఐటీడీఏలు సమర్థంగా పని చేయాలనే ఐఏఎస్‌లను ఉంచాం. అవకాశాలు కల్పిస్తే గిరిజనులు అద్భుతాలు సాధిస్తారు. పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. పాఠశాలలకు భవనాల కోసం నిధులు విడుదల చేస్తున్నాం. గిరిజన ప్రాంతాలకు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చాం. డోలీ మోతలు లేని గిరిజన గ్రామాలుగా మారుస్తున్నాం. నేను సీఎంగా ఉన్నప్పుడు చైతన్యం కార్యక్రమం తీసుకొచ్చాను. గిరిజనుల్లో చైతన్యం తీసుకురాగలిగితే అభివృద్ధి ఆగదు. హక్కులు కాపాడుతూ ముందుకెళ్తేనే మీ జీవితాల్లో వెలుగులు సాధ్యమవుతాయి" అని చంద్రబాబు అన్నారు.

## బహుళ ప్రయోజనాలుండేలా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్

# అత్యంత అధునాతనంగా నిర్మించాలి

**మొదటిపేజీ తరువాయి...**

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** హైదరాబాద్ కోర్ అర్బన్ సిటీ ఏరియాలో చేపట్టే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్ట్ ను బహుళ ప్రయోజనాలుండేలా అత్యంత అధునాతనంగా నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను అదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు స్వాగతం పలికేలా హైదరాబాద్ ముఖద్వారంగా హిమాయత్ సాగర్ గాంధీ సరోవర్ దగ్గర ఓఆర్ఆర్ పై గేట్ వే అఫ్ హైదరాబాద్ నిర్మించాలని సూచించారు. ఓఆర్ఆర్ కు ఒక వైపున ఎకో థీమ్ పార్క్ అభివృద్ధి చేసి మరోవైపున బాపూ ఘాట్ వైపు భారీ ఐకానిక్ టవర్ నిర్మించాలని..

అందుకు తగిన విధంగా డిజైన్లు రూపొందించాలని సీఎం అదేశించారు. ఓఆర్ఆర్ కు ఒక వైపున ఉండే ఎకో థీమ్ పార్క్.. మరో వైపున నిర్మించే ఐకానిక్ టవర్ కు చేరుకునేందుకు ప్రయాణాలకు వీలుగా ఎలివేటెడ్ గేట్ వే నిర్మించి దాన్ని గేట్ వే అఫ్ హైదరాబాద్ గా డిజైన్ చేయాలని సీఎం అదేశించారు.

**ప్రపంచంలోనే ఎత్తైన టవర్ గా ఐకానిక్ టవర్..**

బాపూఘాట్ చుట్టూ ఉన్న ఏరియాను వరల్డ్ క్లాస్ జోన్ గా అందరిని ఆకట్టుకునేలా డిజైన్ చేయాలని సూచించారు. హిమాయత్ సాగర్ దగ్గర అప్రోచ్ రోడ్ నుంచి అత్తాపూర్ వైపు వెళ్లేందుకు కొత్త ఫ్లైఓవర్ నిర్మించాలని,గాంధీ సరోవర్ చుట్టూ ఈ ఫ్లైఓవర్ కనెక్టివ్ కారిడార్ లా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఎయిర్ పోర్ట్ నుంచి నేరుగా గాంధీ సరోవర్ కు చేరుకునేలా ఈ కనెక్టివిటీ ఉండాలన్నారు. గాంధీ సరోవర్ వద్ద నిర్మించే ఐకానిక్ టవర్ ప్రపంచంలోనే ఎత్తైన టవర్ గా నిర్మించాలని సీఎం సూచించారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని, అక్కడ ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఎంత ఎత్తున నిర్మించాలనేది అంచనాకు రావాలని సీఎం సూచించారు.

**రెండు నెలల్లో టెండర్లు..**

తాగు నీటితో పాటు వరద నీటి నిర్వహణకు వీలుగా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు ఉండాలని, వివిధ దేశాల్లో అమల్లో ఉన్న ప్రాజెక్టు నమూనాలు పరిశీలించాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఉస్మాన్ సాగర్ హిమాయత్ సాగర్ తాగు నీటిని హైదరాబాద్ నగర అవసరాలు తీర్చేందుకు మరింత సమర్థంగా వినియోగించుకునేలా ప్లానింగ్ చేయాలన్నారు. స్థలం వృథా కాకుండా మూసీ పరివాహక ప్రాంతం ఇరువైపులా అండర్ గ్రౌండ్ లో భారీగా వాటర్ స్టోరేజ్ సంప్ నిర్మించే సదుపాయాలు.. అక్కడి నుంచి వాటర్ ట్రాన్స్ పోర్ట్ జరిగేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. గాంధీ సరోవర్ ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసే పనులకు వాటర్ ఫ్లో స్టడీస్ పక్కాగా చేసుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు.రెండు నెలల్లో టెండర్లు పిలిచేందుకు వీలుగా పనుల వేగం పెంచాలని ముఖ్యమంత్రి అధికారులను అదేశించారు.



# ఏ జాతికైనా భాష గుర్తింపు



**మొదటిపేజీ తరువాయి...**

**విశ్వంభర,అవనిగడ్డ:** సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణకు మండలి వెంకటకృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం వరించింది. కృష్ణాజిల్లా అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో పురస్కార ప్రదానోత్స వం నిర్వహించారు. మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శతజయంతి సంఘం ఈ అవార్డును ప్రదానం చేసింది. ఈ సందర్భంగావివిధ రంగాల ప్రముఖులు జస్టిస్ ఎన్.వి.రమణ దంపతులను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా జస్టిస్ రమణ మాట్లాడుతూ.. ఏ జాతికైనా భాష గుర్తింపు తీసుకొస్తుందని, భాష లేకపోతే జాతి మనుగడ ఉండదని చెప్పారు. "తెలుగు వాడిని అని చెప్పాలంటే భాష, సంస్కృతి నిలబడాలి. భాష అంతరించిపోయే పరిస్థితి ఇప్పుడు

## భాష లేకపోతే జాతి మనుగడ ఉండదు

కనిపిస్తోంది. అందుకే భాషను పరిరక్షించాలని కోరుతున్నాం. ఆంగ్లం నేర్చుకోవాలి. అదే సమయంలో మాతృభాష కాపాడుకోవాలి. వేరే భాష నేర్చుకుంటే గొప్పవారవుతారనేది ప్రమాదకరమైన ధోరణి. మనిషి జీవన, భాష పరిణామక్రమంలో అనేక ఉద్యమాలు వచ్చాయి. గిడుగు, కందుకూరి, గురజాడ వంటివారు భాష కోసం కృషి చేశారు. భాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ప్రజలందరిపైనా ఉంది. ఇది రాజకీయ ఉద్యమం కాదు.

సామాన్యుడి గొంతు వినిపించాలంటే భాష పరిరక్షించుకోవాలి. తెలుగు వైభవ పురస్కారం ఇచ్చి, నాపై మరింత బాధ్యత పెంచారు. నా తరపున, నా కుటుంబం తరపున మండలి ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు. మండలి వెంకట కృష్ణారావు మహోన్నత వ్యక్తి. మానవతా మూర్తి, గాంధేయవాది. తెలుగు భాష కీర్తికి అహర్నిశలు పాటుపడ్డారు. సమాజసేవ కోసం అనునిత్యం తపనపడ్డారు. ఆయన ఆశయాలు ఆచరించడమే ఆయనకు నిజమైన నివాళులు.యువతరంలో సామాజిక స్పృహ,చైతన్యం కొరవడుతోంది.సమాజంలో ఏం జరుగుతుందోననే ఆలోచన తగ్గుతోంది. ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. సమాజంలో అవినీతితో కూడుకున్న రాజకీయ వ్యవస్థ పోవాలి. మండలి బుద్ధప్రసాద్ వంటివాళ్లు రాజకీయాల్లో కొనసాగాలి" అని జస్టిస్ ఎన్.వి.రమణ అన్నారు.

# కేటీఆర్‌కు రాఖీ కట్టని కవిత..

## రాజకీయ వర్గాల్లో మొదలైన చర్చ..!



**మొదటిపేజీ తరువాయి...**

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్రమంతా రాఖీపౌర్ణమి వేడుకలు జరుపుకుంటుండగా.. ప్రతీ రాఖీకి తమ అనుబంధాన్ని చాటే అన్నా చెల్లెళ్లు మాత్రం దూరంగా ఉన్నారు. ప్రతి ఏటా అన్నకు క్రమం తప్పకుండా రాఖీ కట్టే చెల్లెమ్మ.. ఈ సారిఎడబాటును చూడాల్సిన పరిస్థితి వచ్చింది. కేటీఆర్-కవితల మధ్య ఏఏడాది లేనంత దూరం పెరిగినట్లు కనిపిస్తోంది.

రాఖీ పౌర్ణమి సందర్భంగా.. అన్నకురాఖీ కట్టేందుకు వస్తానంటే తాను హైదరాబాద్ లో లేనని,కలవలేనని చెప్పినట్లుగా కవిత సన్నిహిత వర్గాలు చెప్తున్నాయి. రాఖీ సెలబ్రేషన్స్ గురించి కొందరు విలేకరులు ఆమెనుఅడగ్గా..అన్న కేటీఆర్ బెంగళూరులో ఉన్నట్లు చెప్పారని, ప్రస్తుతం తాను హైదరాబాద్ లో అందుబాటులో లేనని మెసేజ్ పెట్టారని తెలిపారు. అందుకే రాఖీ వేళ అన్నకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. కేటీఆర్ బెంగళూరులో ఉండటమే ఇందుకు కారణమా? లేక కొన్నాళ్లుగా పార్టీ పరంగా నెలకొన్న విభేధాలు కారణంగా నిలిచాయా..?అని రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.

# స్వయం సహాయక సంఘాల్లో ఇక బాలికలు

## 15-18 సంవత్సరాల బాలికలను సైతం సంఘాల్లో చేర్చుకునేలా ప్రణాళిక

**మొదటిపేజీ తరువాయి...**

**ప్రత్యేక ప్రణాళిక..**

ఈ కార్యక్రమాన్ని అమలు చేయడానికి సెర్ప్ ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఇంకా సంఘాల్లో చేరని మహిళలు, దివ్యాంగులు, వృద్ధ మహిళలను గ్రామాల్లో గుర్తించాల్సి ఉంటుంది. పింఛన్ దారుల జాబితాలు (ఓఏపీ, పీడబ్ల్యూడీ), ఉపాధి హామీ జాబ్ కార్డులు, గ్రామ పంచాయతీ ఇంటి పన్ను జాబితాలను ఉపయోగించి ఈ జాబితాలను రూపొందించవచ్చు.

కొత్త స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయడం లేదా అర్హులైన వారిని ఇప్పటికే ఉన్న సంఘాలలో చేర్పించాలి. అనంతరం, వారి కోసం పొదుపు ఖాతాలను సమీప బ్యాంకుల్లో తెరవాలి. సభ్యుల వివరాలు, స్వయం సహాయక సంఘాల వివరాలను సెర్ప్ పోర్టల్స్ లో నమోదు చేయాలి. స్వయం సహాయక బృందాల ద్వారా వారికి బ్యాంకు లింకేజీలు, సీఐఎఫ్ రుణాలు, స్త్రీనిధి రుణాలు, సెర్ప్ నుండి రివాల్వింగ్ ఫండ్ వంటి ఆర్థిక సహాయాలు కూడా అందిస్తారు.

**మార్గదర్శకాలు ఇలా..**

ఒక సంఘంలో 10 నుండి 15 మంది సభ్యులు ఉండేలా, ప్రత్యేక పరిస్థితుల్లో ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులతో కూడా సంఘాలను ఏర్పాటు చేయవచ్చని పేర్కొన్నారు. 60 సంవత్సరాలు పైబడిన మహిళలు మాత్రమే ఈ సంఘాల్లో చేరడానికి అర్హులని, ప్రస్తుతం మహిళా స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉన్నవారు అనర్హులని తెలిపారు. పదవీ విరమణ పొందిన వారు సంఘ తీర్మానం ఆధారంగా చేరవచ్చు. తమ పనులు తాము చేసుకోగలిగేవారు, ఇతరుల సహాయం పాక్షికంగా అవసరమైనవారు సభ్యులుగా ఉండవచ్చని తెలిపారు. పూర్తిగా శారీరక శక్తి కోల్పోయి, అనారోగ్యంతో మంచాన పడినవారు అనర్హులని తెలిపారు. సంఘం పేరు మీద బ్యాంకులో పొదుపు ఖాతా తెరవాలి. సభ్యులు తమ ఆదాయం ప్రకారం ప్రతినెల పొదుపు చేసుకోవాలి. సభ్యుల అవసరాల కోసం పొదుపు చేసిన డబ్బును బ్యాంకు నుండి విత్‌డ్రా చేసి అంతర్గత రుణాలుగా ఇవ్వాలి. కనీసం 15 రోజులకోసారి తప్పనిసరిగా సమావేశం నిర్వహి ంచాలి. సంఘం పనితీరు ఆధారంగా గ్రేడింగ్ చేసి, నియమాల ప్రకారం ఆర్ఎఫ్, వీఆర్ఎఫ్ నిధులు అందిస్తారు.

**అధికారుల బాధ్యతలు..**

వృద్ధ మహిళా సంఘాల అవశ్యకతపై జిల్లా, మండల, గ్రామ సమాఖ్య సమావేశాల్లో చర్చించి, వార్షిక కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలి. అర్హులైన వృద్ధ మహిళలను గుర్తించి, సంఘాలుగా ఏర్పాటు చేయాలి. వారికి చట్టపరమైన హక్కులు, రక్షణలపై అవగాహన కల్పించాలి. ప్రభుత్వ పథకాల గురించి వివరించి, అర్హులైన వారికి అవి




అందేలా చూడాలి. మండల పరిషత్, మండల రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు, బ్యాంకు మేనేజర్లకు ఈ సంఘాల గురించి తెలియజేయాలి. గ్రామ పంచాయతీ, గ్రామంలోని ప్రముఖ వ్యక్తుల సహకారం తీసుకోవాలి. అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఆర్డీఏ అధికారులు ఈ మార్గదర్శకాలను అమలు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ కార్యక్రమం ద్వారా వృద్ధ మహిళలు ఎదుర్కొంటున్న ఆర్థిక భద్రత లేకపోవడం, ఒంటరితనం, కుటుంబంలో గుర్తింపు లేకపోవడం వంటి సమస్యలను అధిగమించవచ్చని ప్రభుత్వం భావిస్తున్నది.

**దివ్యాంగుల కోసం..**

తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి పాలసీలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలతో పాటు దివ్యాంగుల కోసం కూడా ప్రత్యేకంగా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయడమే దీని లక్ష్యం. ఈ కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు ఆర్థికంగా, సామాజికంగా చేయూత అందించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇప్పటికే రాష్ట్రంలో 44,478 మంది దివ్యాంగులు 6,147 సంఘాలుగా ఏర్పడి ఉన్నారు. ఇప్పటికే ఉన్న సంఘాలను పునరుద్ధరించడం, బలోపేతం చేయడం కూడా ఈ కార్యక్రమంలో భాగంగా జరుగుతుంది.

**నెలాఖరుకు పూర్తయ్యేలా..**

గ్రామంలో పెన్షన్ పొందుతున్న దివ్యాంగుల వివరాలు సేకరించి, వారినిగ్రామ,మండల స్థాయి సిబ్బంది కలిసి స్వయం సహాయక సంఘాలుగా ఏర్పాటు చేస్తారు. దివ్యాంగులను ఆగస్టు 14వతేదీలోపు గుర్తించాల్సి ఉన్నది. అన్ని గ్రామాల్లో దివ్యాంగుల సంఘాలపై అవగాహనా కార్యక్రమాలను ఆగస్టు 15వ తేదీలోపు పూర్తి చేయాలి. కొత్త సంఘాల ఏర్పాటు ఈ నెల మూడో వారంలోపు పూర్తి చేయాలి.

సంఘాలుగా ఏర్పాటు చేసిన తర్వాత తప్పనిసరిగా బ్యాంకు ఖాతాలు తెరవాలి. ఆగస్టు చివరి నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలి. ఒక్కో సంఘంలో కనీసం 5నుంచి గరిష్టంగా 20 మంది సభ్యులు ఉండవచ్చు. మహిళలు, పురుషులు ఇద్దరూ సభ్యులుగా చేరవచ్చు. 18 సంవత్సరాల లోపు వారికి వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులు ప్రతినిధులుగా వ్యవహరించవచ్చు. కొత్తగా ఏర్పడిన సంఘాలకు, ఇంకా రివాల్వింగ్ ఫండ్ అందని సంఘాలకు నిబంధనల మేరకు రివాల్వింగ్ ఫండ్ అందిస్తారు. సభ్యులకు నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి శిక్షణలు ఏర్పాటు చేసి ఆదాయం పెంచేందుకు కృషి చేస్తారు. అవసరమైన వారికి కృత్రిమ పరికరాలను సమకూర్చడానికి వికలాంగుల శాఖ, ఎన్జీఓల సహకారం తీసుకుంటారు. సభ్యుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి నిపుణుల ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## నాలుగేళ్ల తమ్ముడికి ప్రాణం పోసి..
# నేనున్నానని భరోసా ఇచ్చిన అక్క

విశ్వంభర, హైదరాబాద్: అరుదైన వ్యాధితో బాధపడుతూ ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న తమ్ముడికి అండగా నిలిచిందో అక్క. అపోహలను పక్కన పెట్టి.. తనమూల కణాలను దానం చేసి అతడి ప్రాణాలు కాపాడింది. అక్కాతమ్ముళ్ల అనుబంధానికి నిదర్శనంగా నిలిచింది. మానవ సంబంధాలు క్షీణిస్తున్న ఈ రోజుల్లో.. బంధం అంటే ఇలా ఉండాలని రుజువు చేసింది. శుక్రవారం రాఖీ పండగ సందర్భంగా సోదరిడికి రాఖీ కట్టి.. 'నీకు నేను న్నా తమ్ముడూ' అంటూ భరోసా ఇచ్చింది. ఈ సందర్భం అక్కడి వారి గుండెల్ని మెలిపెట్టింది. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఐదేళ్ల బాలుడు అప్లాస్టిక్ అనీమియా అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో మూలకణాలను మార్చా లని వైద్యులు సూచించారు. అందుకు ఇంటర్ చదువుతున్న అతడి సోదరి ముందుకొచ్చింది. తమ్ముడికి ధైర్యం చెప్పి, తన శరీరంలోని మూలకణాలను దానం చేసి, అతడి ప్రాణాలు రక్షించింది. రాఖీ పండుగను పురస్కరించుకొని సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో తమ్ముడికి రాఖీ కట్టి.. ' నీ కోసం నేనున్నా తమ్ముడూ' అంటూ ధైర్యం



చెప్పింది. ఈ సందర్భంగా వైద్యుడు నరేందర్ కుమార్ మాట్లాడుతూ.. అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ఇది నిదర్శనమని అన్నారు.

# కేటీఆర్..! ఎక్కడికి రావాలో టైం, డేట్ చెప్పు
## బండి సంజయ్ సంచలన సవాల్

విశ్వంభర, హైదరాబాద్‌: తెలంగాణలో విచిత్ర రాజకీయం నడుస్తోందని బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఇవాళ ఆయన రాష్ట్రంలో అక్కా, చెల్లెళ్లకు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో చిత్రవిచిత్ర రాజకీయాలు నడుస్తున్నాయని.. నువ్వు నాకు రక్ష, నేను నీకు రక్ష అన్నట్లుగా కాంగ్రెస్ , బీఆర్ఎస్ పొలిటికల్ దోస్తీ కొనసాగుతోందని ఆరోపించారు. వాళ్ల అవినీతికి వీళ్లు.. వీళ్ల అవినీతి వాళ్లు పరస్పరం సహకారం చేసుకుంటూ.. రాష్ట్రాన్ని నట్టేట ముంచుతున్నారని ఫైర్ అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్‌లు, ఎంక్వైరీలు తప్ప కేసులో ఇప్పటి వరకు ఏ ఒక్క రాజకీయ నాయకుడిని అరెస్ట్ చేయలేదని అన్నారు. నిందితుడు రాధాకిషన్ రావు స్టేట్‌మెంట్‌లో కేసీఆర్ పేరు ఉందన్నారు. ఒకవేళ కేటీఆర్ తనకు ఇచ్చే నోటీసులకు ఏం సమాధానం ఇవ్వాలో తనకు తెలుసని అన్నారు. అదే తాము నోటీసులు ఇవ్వాలనుకుంటే చాలా ఉన్నాయని బండి సంజయ్ ఓ రేంజ్‌లో వార్నింగ్ ఇచ్చారు.

**మేం మావోయిస్టు సింపతైజర్లమట...**

కేటీఆరే తన ఫోన్ ట్యాపింగ్ చేయించాడని తనకు తెలుసని బండి సంజయ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై తడి బట్టలతో తాను ప్రమాణానికి సిద్ధమని బండి సంజయ్ అన్నారు. కావాలంటే తన ఫ్యామిలీ మొత్తాన్ని తీసుకొచ్చి ప్రమాణం చేయిస్తానని అన్నారు. ఏ గుడికి రమ్మంటారో కేటీఆరే.. డేట్, టైమ్ చెప్పాలని బండి సంజయ్, కేటీఆర్‌కు సంచలన సవాల్ విసిరారు. తన సవాలుపై కేటీఆర్ స్పందించాలని అన్నారు. సొంత బీఆర్ఎస్ పార్టీ నాయకులు అందరి ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయని తెలిపారు. మావోయిస్టు సింపతైజర్లుగా మా పర్లు పోలీసులకు పంపడం దారుణమని అన్నారు. ఆ జాబితాలో తన



పేరుతో సహా రేవంత్ రెడ్డి పేరు కూడా ఉందని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు సిగ్గుంటే ఇప్పటికైనా ఆ పార్టీ నుంచి బయటకు రావాలని బండి సంజయ్ కామెంట్ చేశారు.

**కేసీఆర్‌కు రూ.వేల కోట్లు ఎక్కడివి..**

హైకోర్టు జడ్జిలు, భార్యాభర్తలు, వ్యాపారవేత్తలు, సినీ ప్రముఖుల ఫోన్లు ట్యాప్ చేసి బ్లాక్ మెయిల్ చేశారని బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు. అసలు కేసీఆర్‌కు రూ.వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. గతంలో ఢిల్లీ, బెంగాల్ ప్రభుత్వాలకు డబ్బులు పంపలేదా అని ఫైర్ అయ్యారు. చివరికి మహారాష్ట్ర ఎన్నికలకు కూడా కేసీఆర్ డబ్బులు పంపారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు ఇప్పటికే వరకు కేసీఆర్, కేటీఆర్‌ను ఎందుకు పిలవడం లేదని సిట్‌ను ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసలో రాష్ట్ర ప్రభుత్వ విచారణపై తమకు నమ్మకం లేదని, సీబీఐతో విచారణ జరిపిస్తే అన్ని వివరాలు బయటకు వస్తాయని బండి సంజయ్ అన్నారు.

# రాజకీయమే వద్దనుకుంటున్నా..
## మాజీ మంత్రి మల్లారెడ్డి సంచలన వ్యాఖ్యలు



విశ్వంభర, హైదరాబాద్‌: మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజలకు సేవ చేసి మంచిగా కాలేజీలు, యూనివర్సిటీలు నడిపించుకుంటూ. రాజకీయాలకు గుడ్‌బై చెప్పే ఆలోచనలో ఉన్నట్లు మనసులో మాట బయటపెట్టారు. రాఖీ పండుగ సందర్భంగా ఆయన శనివారం తన కార్యాలయంలో మీడియాతో మా ట్లాడారు. తాను రాజకీయంగా బీజేపీ వైపా, టీడీపీ వైపా, బీఆర్ఎస్ పార్టీలవైపా అన్నది కాదని, ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీలోని ఉన్నానని మల్లారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు 73 సంవత్సరాలు వచ్చాయని, ఇంకా ఏ వైపునకు చూడాల్సిన అవసరం ఏముందని చెప్పుకొచ్చారు. ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రిని అయ్యాను.. ఇంకా మూడేళ్లు రాజకీయాల్లో ఉంటానని క్లారిటీ ఇచ్చారు. అసలు తను రాజకీయమే వద్దనుకుంటున్నాని తెలిపారు.

# అక్కడ 500 మంది అమ్మాయిలను
# అత్యాచారం చేసి చంపేశారు..

**సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు**



విశ్వంభర, తిరుమలః

కర్ణాటకలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మస్థలలో అనుమానాస్పద మరణాలు, పూడ్చివేతల కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఈ ధర్మస్థల వివాదంపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. తాజాగా తిరుమలకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కర్ణాటకలోని ధర్మస్థల ట్రస్ట్ 70 ఏళ్లుగా ఒక కుటుంబం చేతిలో ఉందని కీలక వ్యాఖ్యలు చేశారు. వారికి ఏడాదికి వంద కోట్ల ఆదాయం వస్తోందని తెలిపారు. ఆ ట్రస్ట్ చైర్మన్‌ను బీజేపీ ఎంపీగా నామినేట్ చేసిందని వివరించారు. ధర్మస్థలలో దాదాపు 500 మంది అమ్మాయిలను అత్యాచారం చేసి చంపేసి అక్కడే పూడ్చిపెట్టారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యవహారంపై కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి సిట్ వేసిందని తెలిపారు. అదే బీజేపీ సర్కార్ ఉంటే సిట్ ఏర్పాటు చేసేది కాదని విమర్శించారు. దీంతో అన్ని రకాల విషయాలు బయటకు వచ్చాయ న్నారు. అక్కడ తవ్వుతుంటే స్మశాన వాటికలో ఉన్నట్లు అక్కడ అన్నీ పుర్రెలు, ఎముకలు బయటపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అది పవిత్ర పుణ్యక్షేత్రమా.. శ్మశానవాటికా..? అని ప్రశ్నించారు. సీపీఐ నేత ఎంపీగా చేయకూడని గతంలో ట్రస్ట్ సభ్యులు అడ్డుకున్నారని, అతను తెగించి పోటీ చేసినందుకు పదిహేనేళ్ల తన కుమార్తెను అత్యాచారం చేసి చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనల నేపథ్యంలో ధర్మస్థల ట్రస్ట్‌ను ప్రభుత్వం టేక్ ఓవర్ చేసుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు.

# తెలంగాణ తర్వాతి ముఖ్యమంత్రి బీసీనే..

**కుండబద్దలు కొట్టిన పీసీసీ చీఫ్**

విశ్వంభర, హైదరాబాద్‌: బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి తెలంగాణలో ముఖ్యమంత్రి కావడం ఖాయమని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ జోస్యం చెప్పారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ చిట్‌చాట్ నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు విభేదాలు ఉన్నాయని కొందరు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తున్నారని అన్నారు. అవన్నీ తప్పుడు వార్తలు అని ఈ సందర్భంగా క్లారిటీ ఇచ్చారు. రేవంత్ రెడ్డికి, నాకు మంచి అనుబంధం ఉందని చెప్పారు. మా ఇద్దరి మధ్య ఉన్న ఆ రిలేషన్ మూలంగానే బీసీ రిజర్వేషన్లపై ఇంత వరకు పోరాటం చేయగలిగామని అన్నారు. బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్‌ల మౌనం



బీసీలకు తీరని అన్యాయం చేస్తోందని చెప్పారు. దీనిపై కిషన్ రెడ్డి సైతం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉందని మరోసారి స్పష్టం చేశారు.

# తెలంగాణలో ఎన్టీపీసీ మరో భారీ పెట్టుబడి..

**- సీఎంను కలిసిన బృందం**



విశ్వంభర, హైదరాబాద్‌: తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ఎన్టీపీసీ ముందుకు వచ్చింది. సోలార్, విండ్ విద్యుత్ ప్రాజెక్టుల్లో దాదాపు రూ.80 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఎన్టీపీసీ సీఎండీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరిచారు. జూబ్లీహిల్స్ లోని సీఎం నివాసంలో రేవంత్ రెడ్డిని శనివారం ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్ బృందం మర్యాదపూ ర్వకం గా కలిసింది. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో పెట్టుబడులకు సుముఖంగా ఉన్నట్లు ఈ సందర్భంగా ఈ టీమ్ వివరిచింది. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ ద్వారా 6700 మెగావాట్ల ఉత్పత్తికి అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబ డులు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎన్టీపీసీకి అన్ని విధాలా సహకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

## బిహార్ ఓటమి ఊహించే
# ఈసీపై రాహుల్ విమర్శలు

విశ్వంభర, నేషనల్ బ్యూరో : త్వరలో జరగబోయే బిహార్ ఎన్నికల్లో ఓటమిని ముందుగానే ఊహించిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంపై ఆరోపణలు చేస్తున్నారని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ విమర్శించారు. ఈసీ, భాజపా కుమ్మక్కయ్యా యంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎవరికైనా అన్యాయం జరిగిందని భావిస్తే వారు సుప్రీం కోర్టును ఆశ్రయించొచ్చని సూచించారు. ఈసీ అఫిడవిట్ సమర్పించ మని అడిగితే పార్లమెంట్‌లో ప్రమాణం చేశానని రాహుల్ గాంధీ తప్పించుకుంటున్నారని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీకి ఎక్కువ సీట్లు వచ్చాయని కేంద్రమంత్రి గుర్తుచేశారు. అప్పట్లో ఈసీని కొనియాడారని, అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు తగ్గడంతో ఈసీని తప్పుబడుతున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ ఆరోపణల్లో నిజం లేదని, ఎన్నికల సంఘం పారదర్శకంగా పనిచేస్తోందన్నారు. రాబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తప్పదని ఊహించి ముందుగానే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పాక్‌లో తలదాచుకున్న ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయడమే 'ఆపరేషన్ సిందూర్' ముఖ్య ఉ



ద్దేశమని పేర్కొన్నారు. ఆపరేషన్ కొనసాగుతుందన్నారు. కాల్పుల విరమణ, టారిఫ్‌ల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యల గురించి మాట్లా డుతూ. 144 కోట్లపౌరుల ప్రయోజనాలే తనకు ముఖ్యమని ప్రధాని మోదీ స్పష్టంచేశారన్న అంశాన్ని ప్రతాప్ రావ్ జాదవ్ గుర్తుచేశారు.

## భారత్ ఓపిక పడితే..
# ట్రంప్ పేకమేడ కూలడం ఖాయం

విశ్వంభర, ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ వార్‌పై స్వదేశంలోనూ వ్యతిరేకత ఎదురవుతోంది. ఈ సుంకాల వల్ల అమెరికా ప్రజలకే ఎక్కువ నష్టం వాటిల్లనుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా అమెరికా ఆర్థికవేత్త, జాన్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ స్టీవ్ హాంకీ కూడా ఇదేవిధమైన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. సుంకాల పేరుతో ట్రంప్ కడుతున్న పేక మేడ త్వరలోనే కూలిపోతుందని దుయ్యబ ట్టారు. అప్పటివరకు భారత్ ఆయన జోలికి వెళ్లకపోవడమే మంచిదని సూచించారు. జాతీయమీడియా సంస్థ ఎన్డీటీవీతో మాట్లాడిన స్టీవ్ హాంకీ.. భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాల అంశాన్ని ప్రస్తావించారు. "సుంకాలపై ట్రంప్ నిర్ణయాలు పూర్తిగా అర్థరహితం. ఇక్కడో విషయం చెప్పాలి. 'తనను తాను నాశనం చేసుకునే శత్రువు జోలికి వెళ్లకపోవడమే మంచిద'నేది నెపోలియన్ మాట. ఇప్పుడు ట్రంప్ కూడా ప్రపంచదేశాలతో వాణిజ్య యుద్ధాలు చేస్తూ తనను తానే నాశనం చేసుకుంటున్నారని అనిపిస్తోంది. భారత్ విషయానికొస్తే.. ప్రస్తుతం ప్రధానమంత్రి నరేంద్రమోడీ, విదేశాంగ మంత్రి జైశంకర్ కొంతకాలం ఓపిక పట్టి ఎదురుచూడాలి. ఎందుకంటే ట్రంప్ పేకమేడ త్వరలోనే కూలిపోతుంది" అని ఆ ప్రొఫెసర్ అభిప్రా యపడ్డారు. అమెరికన్ల వినిమయ ఖర్చులు పెరిగితే తమ దేశ ద్రవ్యలోటు ఎక్కువవుతుందని హాంకీ అంచనా వేశారు. టారిఫ్‌లపై ట్రంప్ విధానాలు




చాలా చెత్తగా ఉన్నాయని దుయ్యబట్టారు. దీనివల్ల తమ ఆర్థికవ్యవస్థకే నష్టం చేకూరే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. రష్యా చమురును కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై సుంకాలను ట్రంప్ రెట్టింపు చేసి 50శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. ఈ సుంకాల విషయం తేలేవరకు న్యూదిల్లీతో వాణిజ్య చర్చలు కూడా జరపబోమని తేల్చిచెప్పారు. దీంతో ఇరుదేశాల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ట్రంప్ నిర్ణయాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది అన్యాయమైన, అసమం జసమైన చర్య అని పేర్కొంది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని న్యూదిల్లీ స్పష్టం చేసింది.

## రాహుల్ ఆరోపణలపై
# ఈసీ దర్యాప్తు చేయాలి : శరద్ పవార్

విశ్వంభర, నేషనల్ బ్యూరో: కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో చేసిన ఆరోపణలపై ఎన్సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు శరద్‌పవార్ స్పందిం చారు. ఓట్ల దొంగతనంపై రాహుల్ ఇచ్చిన ప్రజెంటేషన్ గురించి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్రనేత సరైన ఆధారాలతోనే ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నిస్తున్నారన్నారు. ఈవిషయాన్ని పరిశీలించి దర్యాప్తు చేయాల్సిన బాధ్యత ఈసీపై ఉందన్నారు. మహారాష్ట్రలో ఎన్నికలకు ముందు ప్రతిపక్ష మహావికాస్ అఘాడి మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందని అభిప్రాయ పడ్డారు. ఇప్పటికైనా రాహుల్ అడిగే ప్రశ్నలకు ఈసీ సమాధానం చెప్పి తీరాలని అన్నారు. ఇండియా కూటమి నేతలకు రాహుల్ ఏర్పాటుచేసిన ప్రజెంటేషన్ కార్యక్రమానికి హాజరైన శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే చివరి వరసలో కూర్చోవడాన్ని కూడా భాజపా వివాదంగా మార్చాలని చూస్తోందని మండిపడ్డారు. ప్రజెంటేషన్ సమయంలో టీవీ స్క్రీన్ సరిగ్గా కనిపిస్తుందనే ఆలోచనతో తాను, ఫరూఖ్ అబ్దుల్లా, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కూడా వెనక వరుసలోనే కూర్చున్నామని అన్నారు. ఇందులో వివాదం చేసే విషయం ఏముందని ప్రశ్నించారు. మరోవైపు సెప్టెంబర్9న జరగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికపై ఇండియా కూటమి నేతలు ఇంకా ఓ అభిప్రాయానికి రాలేదని వెల్లడించారు.

**బీజేపీ కూటమితో కలిసే ప్రసక్తే లేదు..**



మహారాష్ట్ర రాజకీయాల్లో పవార్, ఠాక్రేల పేర్లకు ఉన్న ప్రాధాన్యం గురించి తెలిసిందే. ఇటీవల ఠాక్రే సోదరులు తిరిగి కలుసుకున్నట్లే.. ఎన్సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధినేత అజిత్ పవార్‌తో చేతులు కలపనున్నారని వార్తలు వస్తున్నాయి. ఇటీవల ముంబయిలో పవార్ కుటుంబానికి సంబంధిం చిన కార్యక్రమంలో ఇరువురు నేతలు కలిసి పాల్గొనడంతో ఈ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై శరద్ పవార్ స్పందిస్తూ.. అవన్నీ తప్పుడు ప్రచారాలని తోసిపుచ్చారు. భాజపా నేతృత్వంలోని కూటమికి తాను ఎప్పటికీ మద్దతివ్వనని స్పష్టం చేశారు.

# జమ్మూకశ్మీర్‌లో ఎదురుకాల్పులు..ఇద్దరు సైనికులు మృతి

విశ్వంభర, నేషనల్ బ్యూరో: ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం ప్రాంతంలో సైనిక ఆపరేషన్ కొనసాగుతోంది. శుక్రవారం అర్ధరాత్రి భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఇక్కడి దట్టమైన అటవీ ప్రాంతంలో ముగ్గురు ఉగ్రవాదులు రహస్య స్థావరాలను ఏర్పరుచుకొని ఉంటున్నట్లు నిఘా సమాచారం అందింది. దీంతో భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి కాల్పులు జరిపాయి. ఈక్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు సైనికులు లాన్స్‌నాయక్ ప్రీత్‌పాల్ సింగ్, సిపాయి హర్మిందర్‌సింగ్‌లు మరణించారు. మరో ఇద్దరు సైనికులు గాయపడ్డారు. మృతుల కుటుంబాలకు చినార్ కార్ప్స్ సానుభూతి వ్యక్తంచేసింది. ఆపరేషన్ ఇంకా కొనసాగుతుందని తెలిపింది. ఉగ్రవాదులు ఉన్నారన్న నిఘా సమాచారంతో ఆగస్టు 1న అఖల్ గ్రామ పరిసరాల్లో 'ఆపరేషన్ అఖాల్' పేరుతో భద్రతాధికారులు ఆపరేషన్ చేపట్టారు. ఇది తొమ్మిదో రోజుకు చేరుకుంది.

# కథలు సంపూర్ణ, సమగ్ర వికాసానికి దోహదం

అమ్మ అంటే కథలు అంటే ఇష్టపడని వారు ఎవరూ ఉండరు. ముఖ్యంగా పిల్లలు బాగా ఇష్టపడతారు. అమ్మమ్మ, నాయనమ్మ, తాతయ్యలు చెప్పే కథలంటే చెవి కోసుకుంటారు. కానీ ఇప్పుడు కాలం మారింది. మనుషులు మారారు. కథలు చెప్పే దిక్కే లేదు. ఎవరి బిజీ వారిదే. కథలు చెబుదామన్నా వినేవారు కరువు. కథలు వినకపోవడం కానీ, చదవకపోవడం గాని మనిషి జీవితానికి చాలా నష్టం కలుగుతుంది. కథలు సంపూర్ణ, సమగ్ర వికాసానికి దోహద పడతాయి. కథలు చెబుతుంటే తిండి తినాలానే సోయి కూడా ఉండదు. మరి అంత ప్రయోజనాలు ఉన్న కథలకు రోజురోజుకీ ప్రాధాన్యత తగ్గుతుందని చెప్పలేం కానీ, ఎక్కడో ఒకచోట ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు, రచయితలు పిల్లల దరిచేరుస్తూనే ఉన్నారు. కథలకు కరువు లేదు. కుప్పలు తెప్పలు గా కళ్లెదుట కనబడుతూనే ఉన్నవి. తెలుగు నేలంతా బాలల అక్షర సేద్యం సాగుతోంది. తెలంగాణ పుడమంతా పిల్లల పుస్తకంగా మాగాణమై పండుతోంది. ఎందరో బాల సాహితీవేత్తలు సమయాన్ని, ధనాన్ని, అనుభవాన్ని వెచ్చించి బాల సాహిత్యం సేద్యం చేస్తున్నారు. ఇవాళ పిల్లల కోసం పెద్దలే కాదు, పిల్లల కోసం పిల్లల కథలు పిల్లలే రాయడం గొప్ప పరిణామం. ఇది అహ్లాద సమాజానికి సంకేతం అని చెప్పవచ్చు. సమాజం నడవడికను కథలు మారుస్తాయనడంలో ఏ మాత్రం సందేహం లేదు. కాకుంటే కథలు రాసే విధానము , దానివల్ల కలిగే ప్రయోజనాలను విడమర్చి చెప్పగలగాలి. కథల పట్ల విద్యార్థులు ఆసక్తి పెంచాలి. అప్పుడు కథలు చదవడం కాదు తామే స్వయంగా రాసే విధంగా పిల్లలు ఎదుగుతారు. ఇటువంటి సుహృద్భావ వాతావరణం నుంచి పుట్టుకొచ్చిందే " బక్రి చెప్యాల బాదుషాలు ". ప్రముఖ బాలసాహితీవేత్త, తెలుగు భాషోపాధ్యాయులు సిద్దిపేటకు చెందిన ఊరుకోలు లక్ష్మయ్య బక్రీ చెప్యాల బాదుషాలు అనే పేరుతో తన సంపాదకత్వంలో పిల్లలు రాసిన కథలు బడి పిల్లల సంపుటి తీసుకొచ్చారు. ఈ పుస్తకం చూడగానే ముఖచిత్రం బహు ఆకర్షణగా ఉంది. పుస్తకం లోపల 40 కథలు జోడించారు. ఆరవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులు రాసిన చిన్న చిన్న కథలు ఈ పుస్తకంలో చోటు చేసుకున్నాయి. అలతి అలతి పదాలతో సులువుగా అర్థం అయ్యే రీతిలో బడి భాషలోనే కాకుండా ఇంటి భాషలో కథ రాయడం ఆనందించదగ్గ విషయం. మొదటి కథ పాశ్చాతాపం నుండి చివరి కథ తాతకు సాయం వరకు ప్రతి కథ ఆసక్తిగా చదువుచుంటే ఇంకా చదవాలి అనిపించే విధంగా ఉన్నాయి. ఇందులో కథలన్నీ పేజీలకు పేజీలే కాకుండా ప్రతి కథ కూడా ఒక పేజీకి పరిమితమయ్యే విధంగా నాలుగైదు నిమిషాలలో చదివే విధంగా ఉండడం మంచి పరిణామం. ఎందుకంటే కథలు పెద్దగా ఉంటే చదవడం ఆసక్తి ఉండదు. కానీ సంపాదకులు వర్కోలు లక్ష్మయ్య తగిన సూచనలతో పొట్టి పొట్టి కథలు విద్యార్థులతో రాయించడం జరిగింది. బహుశా నాకు తెలిసి వేమన పద్యాలు లెక్క నాలుకల మీద తెలియాడే కథలుగా ఉన్నవి ఇందులో. ప్రతి కథకు సంబంధించిన బొమ్మ, రాసిన విద్యార్థి ఫోటో అమర్చడం మంచి విషయం. ఎందుకంటే విద్యార్థుల దరికి చేరినప్పుడు తాను రాసిన కథను, తన బొమ్మను చూసి మురిసిపోతారు. ఈ బడి పిల్లల కథల సంపుటిలో దాదాపు 31 మంది విద్యార్థులు రాయడం జరిగింది. ప్రతి కథలో నైతిక విలువలు ఆధ్యాత్మిక విలువలు పర్యావరణం సంబంధించిన విలువలు మొదలైన భావాలకు సంబంధించినవే కాకుండా, ఇందులోని చాలా కథలు విద్యార్థులు రాయగా వివిధ పత్రికలు ముద్రితమైనవే. వారు చూసిన, వారి చుట్టూ కనబడే పరిసరాలలో ఉన్న చెట్లు, గుట్టలు, పూలు, పండ్లు, జంతువులు, పక్షులు, ఊర్లను కథా వస్తువులుగా తీసుకొని కథలుగా ఊహాజనితంగా మలిచారు. అమ్మ మాట, నాలుగో బెంచి, అందరూ గొప్పే,ఆటల సారు, సూర్యరశ్మి, కొంగల బెడద, రైతే అన్నదాత మొదలైన కథలలో వున్న వస్తువులను

## బక్రి చెప్యాల కథలన్నీ రసగుల్లలే..




పరిశీలిస్తే నిత్యం వాళ్ళ చుట్టూ ఉన్నవే. ఇందులోని కథలన్నీ మంచి సందేశం ఉన్న కథలే. చాలా వరకు కథలు కల్పితాలుగా ఉంటాయి. కానీ ఇందులో ఉన్న బాలల కథలు వాస్తవానికి దగ్గరగా ఉన్నాయి. ఇందులో ఉన్న కథలన్నింటినీ ఒక బాల సాహితీవేత్తగా దాదాపుగా చదివాను. ప్రతి కథలో విలువైన అంశాల్లే కాదు, తింటుంటే నోరూరించే బాదుషాల లెక్క తీయని కమ్మని కథలను పిల్లలే రాసి అందించడం సమాజం మార్పుకు సంకేతం. ఇటువంటి కథలు మరిన్ని పాఠశాలల నుండి మరిన్ని కథలు రాయాలి.

రావాలి. పుస్తకాల రూపం లో ముద్రించబడాలి. పిల్లలకు చేరువ కావాలి. పిల్లలు ఎదగాలి. పిల్లలతో పాటు మనం కూడా వారి స్థాయికి ఎదిగి రాయాలి. నేటి బాల రచయితలందరూ భవిష్యత్తులో సాహితీవేత్తలుగా కావాలని, ఉన్నతంగా ఎదగాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నాను. భవిష్యత్తులో మరిన్ని కథలు రాసే విధంగా విద్యార్థు లను ప్రోత్సహించాలని రచయితను కోరుతూ పుస్తక రూపంలో జీవం పోసి చిన్నారుల అక్షరాలకు రూపమిచ్చి ఎంతో కృషిచేసి బాలలు రాసిన కథలను వడబోసి సమాజానికి అందిం చిన సంపాదకులు వరుకోలు లక్ష్మయ్యకు హృదయపూర్వక అభినందనలు.



–కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
సెల్: 9441561655

# ఆదర్శ మహిళామణి చారుమతి



**(తరుణీమణుల మాసం శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక వ్యాసం..)**

"న గృహం గృహమిత్యాహుః గృహిణి గృహముచ్యతే" అని శాస్త్ర వచనం. ఇల్లాలు ఉంటేనే ఇంటికి కళ. గృహిణి ఉంటేనే గృహం అంటారు అని అర్థము. ఇల్లాలే ఇంటికి దీపమని నానుడి. ఇవన్నీ ఉత్తమ గృహిణుల గురించి పెద్దలు చెప్పిన మాటలు. అలాంటి కోవలోకి చెందినదే చారుమతి. అసలు పేరులోనే తెలుస్తుంది ఆమె పోకడ. చారు అంటే మంచి. మతి అంటే బుద్ధి. చారుమతి అంటే మంచి బుద్ధి కలది అని అర్థం. ఎంత మంచిదంటే తరతరాలుగా శ్రావణ శుక్రవారం వ్రతం చేసుకున్న ప్రతి స్త్రీ ఆమె కథ చెప్పుకునేటంత మంచి బుద్ధి ఉన్నదని ఎలా తెలుస్తుంది? ఆమె ప్రవర్తనలో వ్యక్తం అవుతుంది. ఆమె ప్రవర్తన ఎలాంటిదో..! ఆమె కథ వల్ల తెలుసుకుందాం! ఆమె జీవితాన్ని మనం కూడా ఆదర్శంగా తీసుకుందాం! వరలక్ష్మి అనుగ్రహానికి పాత్రులమవుదాం!

**చారుమతి వృత్తాంతము..**

మగధ దేశంలో కుండిన నగరంలో చారుమతి అనే ఇల్లాలు ఉండేది ఆమె గయ్యాళి కాక, హితముగా, మితముగా మాట్లాడుతూ.. అత్తమామల సేవ చేస్తూ, భర్తను దైవంగా భావిస్తూ ఉండేది. ఆవిడ ప్రవర్తనకు మెచ్చి వరలక్ష్మీదేవి కలలో కనిపించి శ్రావణ పూర్ణిమకు ముందుగా వచ్చే శుక్రవారం తనను పూజించమని సకల ఐశ్వర్యాలు లభిస్తాయని చెప్పి అంతర్ధానం అయ్యింది మెలకువ వచ్చిన తరువాత తన కల గురించి ఇంట్లో అందరికీ చెప్పి వరలక్ష్మిని పూజించటానికి అన్ని ఏర్పాట్లు చేసింది. శ్రావణ శుక్రవారం నాడు తనకు కలలో చెప్పిన విధంగా గోమయంతో అలికి ముగ్గులు పెట్టి పంచ పల్లవాల (మామిడి, రావి, మేడి, మర్రి, మరియు జువ్వి చిగుళ్ళు) తో కలశ స్థాపన చేసి నాలుగు వర్ణాల వారితో కలిసి వరలక్ష్మి దేవిని పూజించి తోరము కట్టుకొని వాయినాలు ఇచ్చింది. తరువాత స్త్రీలందరితో కలిసి చారుమతి ప్రదక్షణ చేస్తుండగా, మొదటి ప్రదక్షిణ పూర్తయ్యేసరికి అందరి కాళ్లకు అందెలు వచ్చాయి. రెండవ ప్రదక్షిణ పూర్తయ్యేసరికి సర్వాభరణాలు వచ్చాయి ఒంటిపై. మూడవ ప్రదక్షిణ పూర్తయ్యేసరికి ఇళ్ల నుండి వారి వారి భర్తలు వారిని తీసుకుపోవటానికి వాహనాలు తీసుకొని వచ్చారు. తమకింత భాగ్యం పట్టడానికి కారణం చారుమతి అని అందరూ ఆమెను పొగిడి, తమ ఇళ్లకు వెళ్లి ప్రతి సంవత్సరము శ్రావణ పూర్ణి మకు ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మి వ్రతాలు చేసుకొని అష్టైశ్వర్యాలతో తులతూగారు. ఇదీ చారుమతి సంక్షిప్త వృత్తాంతం.

**చారుమతి వ్యక్తిత్వంలోని విశిష్టత..**

ఈ వృత్తాంతంలో చారుమతి ఎలా ఉందో చూశాం కదా! గయ్యాళి కాకుండా, మితంగా, హితంగా, మధురంగా మాట్లాడుతుంది గయ్యాళి కాదు . అలాగని మెతక దనమూ లేదు. కొంత గడుసుదనం ఉంది. గడుసుదనం స్త్రీకి చాలా అవసరం లేకపోతే కుటుంబ బాధ్యతలను నిర్వర్తించడం కష్టమవుతుంది. చారుమతి హితంగా, మితంగా, మధురంగా మాట్లాడుతుంది. అధిక ప్రసంగం చేయదు. అధిక ప్రసంగం అనేది కేవలం స్త్రీలకే కాదు. ఎవరికి ఉన్నా అది ఆమోదయోగ్యం కాదు. కుటుంబానికి కేంద్రబిందువైన స్త్రీ తన కుటుంబానికి హితమైన మాటలే చెప్పాలి. హితమైన పనులే చేయాలి. చారుమతి భర్తను దైవంగా భావించేది. దివ్య గుణాలు ఉన్న వారందరూ దైవ సమానులే అంటాడు గీతాచార్యుడైన శ్రీకృష్ణ పరమాత్ముడు. ఆనాటి పురుషులు కూడా భార్యల చేత దైవంగా పూజించబడటానికి తగిన ప్రవర్తన కలిగి ఉండేవారు. ఒకవేళ కాకున్నా అతన్ని సవరించి సద్గుణవంతునిగా చేయగల సత్తా స్త్రీకి ఉండేది. అలాంటి స్త్రీలకు ప్రతినిధి మన కథలోని చారుమతి. ఇంకా అత్తమామలను తల్లిదండ్రులవలే సేవించేది. విదేశీయులంతా భారతదేశం పట్ల గౌరవం కలిగి ఉండడానికి గల కారణాల్లో ప్రధానమైనది ఇదే. భారత స్త్రీని ప్రపంచంలో గౌరవ స్థానంలో నిలిపేది ఈ విధము లైన గుణగణాలే! తమ బాల్యం వారి ఒడిలో గడిచినట్లే, వారి వృద్ధాప్యం తమ చేయూతతో గడపాలని ప్రతి సంతానము భావిస్తే ఆ పెద్దవారికి అది ఎంతో సంతృప్తిని ఇస్తుంది. ఇలాంటి సంతృప్తిని ఇవ్వగలిగే శక్తి కేవలం ఆ ఇంటి కోడలుకు మాత్రమే ఉన్నది అని గమనించాలి.

**చారుమతిలోని ఆదర్శ లక్షణాలు..**

మితభాషణం, మృదు స్వభావం, భర్తను అత్తమామలను తగువిధంగా గౌరవించడం అనే ఈ మూడు లక్షణాలు వరలక్ష్మీదేవికి బాగా నచ్చి, మెచ్చి, స్వయంగా వచ్చి, వరాలిచ్చి వెళ్ళింది. లక్ష్మీ అనుగ్రహం కావాలంటే ప్రతి గృహిణికి ఇవి ఎంతో అవసరం. ఇవి లేకపోతే ఇంకెన్ని ఉన్న వృథాయేనని చెబుతోంది మనకు చారుమతి కథ. చారుమతిలో కనిపించే మరో ముఖ్యమైన సుగుణం స్వార్థం లేకపోవడం. వరలక్ష్మి తన ప్రవర్తనకు మెచ్చి తనను వ్రతం చేయమన్నది. కానీ తాను ఒక్కతే వ్రతం చేయకుండా, అందరికీ చెప్పి తనతో పాటే అందరి చేత వరలక్ష్మీ వ్రతం చేయించింది. అందరూ అంటే నాలుగు వర్ణాలకు చెందిన స్త్రీలు. అంటే పూజాది కాల విషయంలో కుల పట్టింపులు ఉండకూడదని నమ్మింది. ఆధునికులమని చెప్పుకునే మనం **చారుమతి నుండి ఎంతో నేర్చుకోవాలి కదా!**

పూజకు తమంతట తాము వచ్చిన స్త్రీలను ఇళ్ళకు తీసుకొని వెళ్లడానికి వాహనాలతో భర్తలు వచ్చారు. ఇది ఏ భార్య అయినా కోరుకునే సౌభాగ్యం. తనకోసం భర్త స్వయంగా రావటం అప్పుడు లేని ప్రేమాభిమానాలు వ్రతం చేశాక ఇప్పుడు ఎక్కువైయ్యాయి. వ్రత ఫలితాలకు ప్రధానమైనది ఇదే. నగలు సంపదలకన్నా ఒక స్త్రీ ఎక్కువగా కోరుకునేది భర్త ప్రేమాభిమానాలనే కదా! చారుమతి అందరితో కలిసి సహ పంక్తి భోజనాలు చేసింది. వాయన దానం ఇచ్చింది. ఇవన్నీ సమాజంలో సామరస్యానికి దోహదపడుతుంది. ఇరుగు పొరుగు వారితో సత్సంబం ధాలను పెంచుకునే పనులుగా మనం గ్రహించాలి. చారుమతి ఉత్తమ గృహిణులకు ప్రతినిధి. స్త్రీలందరూ చారుమతి వంటి మనసు, ప్రవర్తన కలిగి ఉంటే తప్పకుండా వరలక్ష్మి దేవి అనుగ్రహం కలుగుతుంది. వర అంటే శ్రేష్టమైన. లక్ష్మీ అంటే సంపద లేదా గుర్తు వరలక్ష్మి అంటే శ్రేష్టమైన సంపదకు గుర్తు అని అర్థం చారుమతి లాంటి ఉత్తమ ఇల్లాలు కోరుకునే శ్రేష్టమైన సంపద భర్త అనురాగం మాత్రమే కాదు కుటుంబం ఆనందం కూడా. అందుకే ప్రతి మహిళ శ్రావణ మాసంలో వచ్చే ఏదైనా శుక్రవారంనాడు పూజ చేసి, చారుమతి కథ చెప్పుకొని కూడా చారుమతి లాంటి ఉత్తమ గుణాలు కలిగి ఉండాలని కోరుకోవాలి. అప్పుడే వరలక్ష్మీదేవి స్వయంగా ఇంట అడుగుపెట్టి అష్టైశ్వర్యాలను సౌభాగ్యాలను ప్రసాదిస్తుంది. ఇది మన సనాతన ధర్మంలోని విశిష్టత.



"సాహిత్య కళా విభూషణ"
చౌడూరి నరసింహారావు
ఆధ్యాత్మిక, సామాజిక విశ్లేషకులు
9705100788

# దేశం వదిలిపోతున్న సంపన్నులు



భారత్ నుంచి ప్రతి ఏడాది వేలాది సంఖ్యలో మిలియనీర్లు ఇతర దేశా లకు వలస పోతున్నారు. ఈ ఏడాది కూడా కనీసం 3,500 మంది వరకు దేశం వదిలి వెళ్లిపోయే అవకాశం ఉందని హెన్లీ అండ్ పార్టనర్స్ నివేదిక పేర్కొంది. వారిలో ఎక్కువ మంది యూఏఈని తమ గమ్యస్థానం గా ఎంచుకుంటారని నివేదిక వెల్లడించింది. గతేడాది 4,000 కంటే ఎక్కువమంది మిలియనీర్లు భారత్‌ను వీడగా, ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థగా భారత్ మిలియనీర్ల వలసల విషయంలో యూకే, చైనా తర్వాత ప్రపంచవ్యాప్తంగా మూడో స్థానంలో ఉంటుందని అంచనా.

సంపన్నుల వలస ఎందుకు?..

కొన్ని దేశాల్లో ఆర్థికంగా గణనీయమైన మార్పులు జరుగుతున్నాయి. చాలా దేశాలు ఉద్యోగాల సృష్టి, ప్రతిభ కోసం మాత్రమే కాకుండా కొత్త గా సంపదను పెంచే, ఎక్కువ సంఖ్యలో మిలియనీర్లు ఉండాలనే దానికోసం పోటీ పడుతున్నాయని నివేదిక పేర్కొంది. అందుగ్గానూ తమ దేశానికి వచ్చే సంపన్నులకు వెసులుబాట్లు కల్పిస్తున్నాయి. సుమారు 63 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో యూఏఈ సంస్కరణల ద్వారా ప్రపంచ సంపన్ను లకు కేంద్రంగా ఎదుగుతోంది.

ప్రపంచవ్యాప్తంగా..


సంపన్నులను కోల్పోవడంతో భారత్‌తో పాటు అనేక దేశాలు ముందు న్నాయి. 2025లో కనీసం 1,42,000 మంది మిలియనీర్లు సొంత దేశం వదిలి మరో దేశానికి తరలివెళ్లే అవకాశం ఉందని నివేదిక అభిప్రాయపడింది. 2026 నాటికి ఈ సంఖ్య 1,65,000కి పెరగవచ్చని అంచనా. మరోవైపు ఈ సంవత్సరం రికార్డు స్థాయిలో 9,800 మంది మిలియనీర్లు యూఏఈకి వెళ్లే సంకేతాలు కనిపిస్తుండటంతో, ప్రపంచంలోనే అతిపెద్ద సంపన్నులను ఆకర్షించే దేశంగా యూఏఈ అగ్రస్థానంలో కొనసాగనుంది. గతేడాది వివిధ దేశాల నుంచి యూఏఈకి 6,700 మంది మిలియనీర్లు వెళ్లారు. ఆ తర్వాత యూఎస్ఏ, ఇటలీ, స్విట్జర్లాండ్, సౌదీ అరేబియా మిలియనీర్లకు ఇష్టమైన దేశాలుగా ఉన్నాయి.

## ఓటు అంటే..ఓ జాబితాలో

# పేరు మాత్రమే కాదు



అది.. ఒక ఆలోచన, ఒక ప్రశ్న, ఒక అభిప్రాయం, ఒక తిరస్కారం, ఒక సమ్మతి, ఒక అసమ్మతి, ఒక ధిక్కారం, ఒక అభివ్యక్తి, ఆగ్రహం, అనుగ్రహం, అసంతృప్తి, ప్రేమ ,అభిమానం లాంటి అనేకానేక మనోగతాలను వ్యక్తం చేయగలిగిన ఒక ప్రజాస్వామిక హక్కు ఆ ఓటు ద్వారా సమకూరింది. మనిషిగా భౌతికంగా, మానసికంగా అది ఒక ఉనికి చిహ్నం. ఆత్మగౌరవ ప్రతీక. ఇంకా విలువైన అనేక సంగతుల, భావోద్వేగాలను వ్యక్తం చేయగల విస్తృత సమాహార మాలిక ఆ ఓటు. ప్రతి వయోజనుడి హక్కు అది. ఆ ఓటరు జాబితాలో పేరు ఉంటే ఏమిటి? లేకుంటే ఏమిటి? అనే నిర్లిప్త ధోరణి సరైంది కాదు. జాబితా నుంచి పేరును తొలగిస్తే ఆ వ్యక్తి ఉనికి లేనట్లే. ఆ వ్యక్తి భౌతికంగా ఉన్నా మృత దేహంతో సమానం. చచ్చిపోయినట్లే లెక్క. ఆ వ్యక్తి ఊపిరిని బల వంతంగా నిలిపివేసినట్లే. ఆ వ్యక్తిని సజీవంగా చంపివేసినట్లే. ఇదీ ఆధు నిక, నాగరిక, ప్రజాస్వామిక సమాజాల్లోని లెక్క. అది ప్రజాస్వామ్యం కాకుంటే రాచరికం అయితే ఓటు ఉన్నా,లేకున్నా, అక్కడ ఎన్నికలు జరిగినా, జరగకున్నా..ఏమీ వ్యత్యాసం లేదు. ప్రజాస్వామిక సమాజాల్లో ఆ జాబితాలను సక్రమంగా రూపొందించి, దానిలోని అర్హులైన వా రితో పారదర్శక ఎన్నికల నిర్వహించి పాలక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే కర్తవ్యం నిర్వాహణ కోసం ఒక వ్యవస్థను నిర్మించు కుంటాయి. వాటికి కమిషన్ అనో, మరో పేరోతోనో ఆ వ్యవస్థను పిలుచుకుంటాయి ప్రజాస్వామిక వ్యవస్థలు. ఆ వ్యవస్థ అధికారంలో ఉన్న వారి జేబు సంస్థ కాదు. ప్రతిపక్షానికి శత్రువు కాదు. ఏ ఒక్క రాజకీయ పక్షానికి శత్రువు కాదు. మిత్రుడు కూడా కాకూడదు. ఆ వ్యవస్థ/ సంస్థ మొత్తం ఆ ప్రజా స్వామిక వ్యవస్థ మనుగడ పురోగతి కోసం పని చేయడం దాని కర్తవ్యంగా ఉండాలి. ఆ పనిని ఆ సంస్థ సక్రమంగా, సమర్థంగా, నిష్పాక్షికంగా నిర్వ ర్తించని పక్షంలో ఆ ప్రజాస్వామిక వ్యవస్థ ఉనికి కొనసాగ దు. ఇప్పుడు ఈ దేశంలో సరిగ్గా అలాంటి పరిస్థితే ఉత్పన్నమైంది. ఈ దుస్థితిని ఈ దేశ పౌర సమాజ చైత న్యం మాత్రమే సరిదిద్దుకోగలదు. పౌర సమాజం ఆ పనిని చేయని, చేయలేని పక్షంలో 80 యేళ్లక్రితం ఈ దేశం నిర్మిం చుకున్న డెమాక్రసీ స్థానంలోకి రాచరిక, నియంతృత్వ వ్యవస్థ ఏ ర్పడే ప్రమాదం చాలా ఉచ్ఛ స్థాయిలో కనిపిస్తున్నది.




గండె గోవర్ధన్

# గూగుల్‌ను మరపిస్తోన్న చాట్‌జీపీటీ..




ఓపెన్‌ఏఐకి చెందిన చాట్‌బాట్ చాట్‌జీపీటీ టెక్ ప్రపంచాన్ని ఊపేస్తోంది. ఆర్టిఫిషీయల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేస్తున్న ఈ చాట్‌బోట్‌ను ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగిస్తున్నారు. రోజువారీ సందేహాలు, సమాచారం, క్రియేటివ్ కంటెంట్, కోడింగ్, డేటా అనలిసిస్ తదితర అవసరాలకు వినియోగదారులు దీనిపై ఆధారపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఓపెన్‌ఏఐ సంస్థ యాక్సియోస్ పత్రికకు వెల్లడించిన తాజా గణాంకాల ప్రకారం, చాట్‌జీపీటీ రోజుకు సగటున 250 కోట్ల ప్రాంప్ట్‌లను హ్యాండిల్ చేస్తోంది. ఇందులో ఒక్క అమెరికా నుంచే రోజుకు 3.3 కోట్ల ప్రాంప్ట్‌లు వస్తుండటం గమనార్హం. వార్షికంగా ఈ సంఖ్య 91 వేల కోట్లకు చేరుతుందని సంస్థ అంచనా వేసింది. ఈ తాజా గణాంకాల ప్రకారం చాట్‌జీపీటీ వినియోగంలో భారీ వృద్ధి కనిపిస్తున్నా, గూగుల్‌తో పోలిస్తే ఇది ఇంకా వెనుకబడ్డట్టే కనిపిస్తోంది. గూగుల్‌లో వార్షికంగా సుమారు 5 లక్షల కోట్ల సెర్చ్‌లు జరుగుతున్నాయి. అయినప్పటికీ, చాట్‌జీపీటీ వృద్ధి రేటు గణనీయంగా ఉండటంతో, ఇది భవిష్యత్తులో గూగుల్‌కు గట్టి ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఇక 2023 డిసెంబర్ నాటికి చాట్‌జీపీటీ వారానికి కేవలం 300 మిలియన్ యాక్టివ్ యూజర్లు మాత్రమే ఉండగా, మూడు నెలల వ్యవధిలోనే ఇది 500 మిలియన్లకు పెరిగింది. ఇందులో ఎక్కువ మంది ఉచిత వర్షన్ వినియోగదారులే కావడం విశేషం. టీవల కొన్ని నివేదికల ప్రకారం, ఓపెన్‌ఏఐ తన స్వంతంగా ఓ ఏఐ ఆధారిత వెబ్ బ్రౌజర్‌ను అభివృద్ధి చేస్తోందని సమాచారం.

ఇది నేరుగా గూగుల్ క్రోమ్‌కు ప్రత్యామ్నాయంగా నిలుస్తుందన్న అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే సంస్థ చాట్‌జీపీటీ ఏజెంట్ పేరుతో ఓ ఫీచర్‌ను విడుదల చేసింది. దీని ద్వారా వినియోగదారుల పనులను ఆటోమేటెడ్‌గా నిర్వహించే సదుపాయం లభిస్తోంది. ఇమెయిల్స్, డేటా విశ్లేషణ, టాస్క్ ప్లానింగ్, కంటెంట్ తయారీ వంటి అనేక సేవల్ని ఇది తక్కువ సమయంలో పూర్తి చేస్తోంది.

# లోపాలు సరిదిద్దుకోవాలి!

ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల సుదీర్ఘ సిరీస్‌ను టీమిండియా 2-2తో సమంగా ముగించిన సంగతి తెలిసిందే. ఈ సిరీస్‌లో భారత జట్టు అంచనాలకు మించి రాణించింది. సీనియర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, అశ్విన్, షమి తదితరులు లేకుండానే భారత్ బరిలోకి దిగింది. వీరు లేని లోటు జట్టుపై పెద్దగా కనిపించలేదు. శుభ్‌మన్ గిల్ తన తొలి సిరీస్‌లోనే కెప్టెన్‌గా జట్టుపై తనదైన ముద్ర వేశాడు. చిరస్మరణీయ ప్రతిభతో జట్టును ముందుండి నడిపించాడు. బ్యాట్‌తోనే కాకుండా సారథిగా కూడా జట్టుపై బాగానే ప్రభావం చూపాడు. తొలి మ్యాచ్ నుంచే గిల్ అద్భుతంగా రాణించాడు. గిల్ దూకుడుగా ఆడుతూ సీనియర్లు విరాట్, రోహిత్‌లు లేని లోటు జట్టుపై పడకుండా చేయడంలో సఫలమయ్యాడు. గిల్‌తో పాటు వైస్ కెప్టెన్ రిషబ్ పంత్, సీనియర్ ఆటగాడు కెఎల్ రాహుల్, యువ ఆటగాళ్లు సాయి సుదర్శన్, యశస్వి జైస్వాల్‌లు కూడా కూడా బాగానే ఆడారు. ఇక సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా జట్టు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టాడు. చిరస్మరణీయ బ్యాటింగ్‌తో పలు మ్యాచుల్లో జట్టును ఆదుకున్నాడు. ఈ సిరీస్‌లో జడేజా ప్రతిభను ఎంత పొగిడినా తక్కువే. వాషింగ్టన్ సుందర్ కూడా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. పలు మ్యాచుల్లో బంతితో, బ్యాట్‌తో జట్టుకు అండగా నిలిచాడు. సిరాజ్, బుమ్రా, ఆకాశ్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణ తదితరులు బంతితో ఆకట్టుకున్నారు. ఇలా జట్టు విజయంలో ప్రతి ఒక్కరు తమవంతు పాత్రను సమర్థంగా పోషించారు. సిరీస్‌లో టీమిండియా అద్భుత ప్రదర్శన చే సినా కొన్ని విషయాల్లో పేలవమైన ప్రదర్శనతో నిరాశ పరిచింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్‌లు వ్యక్తిగతంగా బాగానే ఆడారు. అయితే కలిసి కట్టుగా సా గడంలో విఫలమయ్యారు. ఇద్దరు ఏ ఒక్క మ్యాచ్‌లోనూ జట్టుకు శుభారంభం అందించలేక పోయారు. దాదాపు ఆరు ఇన్నింగ్స్‌లలో వీరు 20 కంటే ఎక్కువ పరుగులను జోడించలేక పోయారు. రాహుల్ రాణిస్తే యశస్వి, జైస్వాల్ సత్తా చాటితే కెఎల్ విఫలం కావడం పరిపాటిగా తయారైంది. దీని ప్రభావం జట్టుపై బాగానే కనిపించింది. రానున్న సిరీస్‌లలో ఓపెనర్లు తమ ఆటను మరింత మెరుగు పరుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇద్దరు సాధ్యమైనంత ఎక్కువగా భారీ భాగస్వామ్యాలు నెలకొల్పేందుకు



ప్రయత్నించాలి. వీరితో పోల్చితే ఇంగ్లండ్ ఓపెనర్లు బెన్ డకెట్, జాక్ క్రాలీలు చాలా మెరుగైన ప్రదర్శనను చేసిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. మరోవైపు టీమిండియా బ్యాటర్లలో నిలకడ కనిపించలేదు. ఒక ఇన్నింగ్స్‌లో రాణిస్తే మరో దాంట్లో విఫలం కావడం అలవాటు గా తయారైంది. యశస్వి, రాహుల్‌ల విషయంలో ఇదే జరిగింది. ఇక యువ ఆటగాడు సాయి సుదర్శన్ విషయంలో కూడా ఇలాంటి పరిస్థితే కనిపించింది. సాయి ఒక ఇన్నింగ్స్‌లో రాణించి రెండో దాంట్లో తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరాడు. ఇక సీనియర్ ఆటగాడు కరుణ్ నాయర్ కూడా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేక పోయాడు. పలు మ్యాచుల్లో ఆడే అవకాశం లభించినా ఫలితం లేకుం డా పోయింది. చివరి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో మాత్రమే నాయర్ అర్ధ సెంచరీ సాధించాడు. మిగతా మ్యాచుల్లో పూర్తిగా నిరాశ పరిచాడు. కోహ్లి, రోహిత్‌లు రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో నాయర్ జట్టుకు చాలా కీలకంగా మారాడు. అయితే అతను మాత్రం అంచనాలకు తగినట్టు రాణించలేక పోయాడు. నితీశ్ కుమార్ రెడ్డి, శార్దూల్ ఠాకూర్‌లు కూడా పెద్దగా ప్రభావం చూపలేక పోయారు. ఆల్‌రౌండర్లుగా వీరు జట్టుకు అండగా నిలివడంలో విఫలమయ్యారు. రానున్న సిరీస్‌లలో కొత్త వారికి ఛాన్స్ ఇచ్చి చూడాలి. వెస్టిండీస్‌తో జరిగే సిరీస్ నాటికి టీమిండియా ఈ లోపాలను సరిదిద్దు కుంటే జట్టుకు ప్రయోజనంగా ఉంటుంది. కెప్టెన్ గిల్‌తో పాటు ప్రధాన కోచ్ గంభీర్ ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# అరంగేట్రంలో అదుర్స్..
# తొలి మ్యాచ్‌లోనే ఆల్‌టైమ్ రికార్డు బ్రేక్

బులవాయో వేదికగా జింబాబ్వేతో రెండో టెస్టును న్యూజిలాండ్ కేవలం మూడు రోజుల్లోనే ముగించింది. ఆతిథ్య జింబాబ్వేను ఇన్నింగ్స్ అండ్ 359 పరుగులతో తేడాతో కివీస్ చిత్తు చేసింది. అయితే ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ అరంగేట్ర ఆటగాడు జకారీ ఫౌల్క్స్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. మొత్తంగా రెండు ఇన్నింగ్స్‌లు కలిపి కేవలం 75 పరుగులు మాత్రమే ఇచ్చి 9 వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలో ఫౌల్క్స్ ఓ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. కివీస్ తరపున అరంగేట్ర టెస్టు మ్యాచ్‌లో అత్యుత్తమ గణాంకాలు సాధించిన ప్లేయర్‌గా ఫౌల్క్స్ చరిత్ర సృష్టించాడు. ఇంతకుముందు ఈ రికార్డు కివీ స్పీడ్ స్టార్ విల్ ఓ'రూర్కే పేరిట ఉండేది. గతేడాది హామిల్టన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో రూర్కే 93 పరుగులిచ్చి 9 వికెట్లు పడగొట్టాడు. తాజా మ్యాచ్‌తో రూర్కే ఆల్‌టైమ్ రికార్డును జకారీ బ్రేక్ చేశాడు. ఓవరాల్‌గా వరల్డ్ క్రికెట్‌లో ఈ రికార్డు భారత మాజీ స్పిన్నర్ నరేంద్ర హిర్వానీ పేరిట ఉంది. హిర్వానీ 1988లో మద్రాసు (ఇప్పుడు చెన్నై) వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో అతడు కేవలం 136 పరుగులు మాత్రమే ఇచ్చి 16 వికెట్లు సాధించాడు.



కాగా జింబాబ్వేతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను న్యూజిలాండ్ వైట్ వాష్ చేసింది. ఈ రెండో టెస్టులో మాట్ హెన్రీ సైతం నిప్పులు చెరిగాడు. హెన్రి రెండు ఇన్నింగ్స్‌లు కలిపి 7 వి?కెట్లు పడగొట్టాడు. బ్యాటింగ్‌లో డెవాన్ కాన్వే (245 బంతుల్లో 153) ,హెన్రీ నికోల్స్(150 నాటౌట్), రచిన్ రవీంద్ర(165 నాటౌట్) భారీ సెంచరీలతో చెలరేగారు.

# టీమిండియా ఘోర ఓటమి.. 73 పరుగులకే ఆలౌట్



ఆస్ట్రేలియా పర్యటనలో భారత్-'ఎ' మహిళా జట్టుకు వరుసగా రెండో ఓటమి చవిచూసింది. మెక్‌కే వేదికగా ఆసీస్-ఎ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో 114 పరుగుల తేడాతో భారత్ పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో సీనియర్ టీమ్ కెప్టెన్ అలీసా హీలీ(44 బంతుల్లో 12 ఫోర్లతో 70) టాప్ స్కోరర్‌గా నిలవగా.. విల్సన్(43), అనికా లియార్డ్(35) రాణించారు. భారత బౌలర్లలో కెప్టెన్ రాధా యాదవ్ రెండు వికెట్లు పడగొట్టగా..ప్రేమా రావత్ ఒక్క వికెట్ సాధించారు. అనంతరం లక్ష్య చేధనలో ఇండియా-ఎ జట్టు ఆసీస్ బౌలర్ల దాటికి కేవలం 73 పరుగులకే కుప్పకూలింది. పేసర్ కిమ్ గార్త్ నాలుగు వికెట్లతో పర్యాటక జట్టు పతనాన్ని శాసించింది. ఆమెతో పాటు, ఎడ్గర్,ఫ్లింటాఫ్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. భారత బ్యాటర్లలో బ్రింధా దినేష్(21), మిన్ను మణి(20) రెండెంకల స్కోర్‌ను అందుకోగా.. మిగితా వారిందరూ సింగిల్ డిజిట్ స్కోర్‌కే పరిమితమయ్యారు. స్టార్ ఓపెనర్ షెఫాలీ వర్మ(3) సైతం బ్యాట్ ఝుళిపించకలేకపోయారు. ఈ విజయంతో మూడు టీ20 సిరీస్‌ను ఆసీస్-ఎ జట్టు మరో మ్యాచ్ మిగిలాండగానే సొంతం చేసుకుంది. ఇక ఇరు జట్ల మధ్య నామమాత్రపు మూడో టీ20 మెక్‌కే వేదికగా ఆదివారం జరగనుంది.

# దాయాదుల పోరుకు ఇబ్బంది ఉండదు..




దుబాయి: ఆసియా కప్‌లో భాగంగా చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య జరిగే పోరుకు ఎలాంటి ఆటంకం లేకుండా చూస్తామని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి సుభాన్ అహ్మద్ ఖాన్ హామీ ఇచ్చారు. భారత్, పాక్ మ్యాచ్‌కు ఎలాంటి అంతరాయం ఉండదన్నారు. ఆసియా కప్‌కు, లెజెండ్స్ ఛాంపియన్స్ ట్రోఫీకి పోలీకే లేదన్నారు. ఆసియాకప్ అంతర్జాతీయ క్రికెట్ టోర్నమెంట్ అనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆసియాకప్‌ను అత్యంత పగడ్బంధీ వ్యూహంతో నిర్వహిస్తామన్నారు. దాయాదుల మ్యాచ్ కోసం ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు. ఎలాంటి లోటు లేకుండా టోర్నీని నిర్వహించి తామెంటో నిరూపిస్తామని సుభాన్ పేర్కొన్నారు.

## సామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్, వాచ్ 8 సిరీస్ ఆవిష్కరణ




న్యూయార్క్‌లో జరిగిన గెలాక్సీ అన్‌ప్యాక్డ్ 2025 ఈవెంట్‌లో సామ్‌సంగ్ మూడు ఫోల్డబుల్ స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది . గెలాక్సీ జెడ్ ఫోల్ 7, జెడ్ ఫ్లిప్ 7, తక్కువ ధరలో అందుబాటులో ఉండే జెడ్ ఫ్లిప్ 7 ఎఫ్‌ఇలను ఆవిష్కరించింది. జెడ్ ఫోల్ 7, సామ్‌సంగ్ గెలాక్సీ ఎస్25 అల్ట్రాకంటే తక్కువ బరువు కలిగి ఉ ండటంతో పాటు కొత్తగా 8 -ఇంచ్ మెయిన్ డిస్‌ప్లేను అందిస్తుంది. ఫ్లిప్ 7లో పెద్ద కవర్ స్క్రీన్, మెరుగైన కెమెరాలు ఉన్నాయి. అత్యంత ప్రీమియంగా ఉండే ఫోల్డబుల్స్‌ను సాధారణ ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకురావాలని సామ్‌సంగ్ లక్ష్యంగా పెట్టుకుంది. దీని కోసం ఫ్లిప్ 7 ఎఫ్‌ఇను బడ్జెట్ ధరలో విడుదల చేసింది.

## ఫండ్ డిస్ట్రిబ్యూటర్లకు సెబీ ఊరట

भारतीय प्रतिभूति और विनिमय बोर्ड
Securities and Exchange Board of India

న్యూఢిల్లీ, ఆగస్టు 9: స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్లపై ప్రస్తుతం విధిస్తున్న లావాదేవీలపై చార్జీలను పూర్తిగా ఎత్తివేస్తున్నట్టు శనివారం సెబీ ప్రకటించింది. ఈ నిర్ణయం అన్ని రకాల అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు వర్తించనున్నదని పేర్కొంది. మే 2023లో పబ్లిక్ కన్సల్టేషన్, ఈ ఏడాది జూన్‌లో ఇండస్ట్రీ కన్సల్టేషన్ నిర్వహించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్టు సెబీ తాజాగా విడుదల చేసిన మాస్టర్ సర్క్యులేషన్‌లో వెల్లడించింది.గతంలో విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం పంపిణీదారులు కనీసం రూ.10 వేలు సబ్‌స్క్రిప్షన్ మొత్తాన్ని తీసుకువచ్చిన వారికి చార్జీల నుంచి మినహాయింపునిచ్చింది. డిస్ట్రిబ్యూటర్లు, ఏఎంసీ ఏజెంట్ల నుంచి సమాచారం ఆధారంగా సెబీ ఈ నిర్ణయం తీసుకున్నది. దీంతో ఇలాంటి చార్జీలను పూర్తిగా ఎత్తివేస్తున్నట్టు తెలిపింది. ఈ నిర్ణయం వెంటనే అమలులోకి రానున్నట్లు పేర్కొంది.

# ఐసీఐసీఐ బ్యాంక్ షాక్..ఇకపై మినిమం అకౌంట్ బ్యాలెన్స్ రూ.50 వేలకు పెంపు

మీరు ఐసీఐసీఐ బ్యాంక్ అకౌంట్ వాడుతున్నారా. అయితే ఈ వార్త మీ కోసమే. ఎందుకంటే తాజాగా ఐసీఐసీఐ బ్యాంక్ తన సేవింగ్స్ అకౌంట్ మినిమం బ్యాలెన్స్ విషయంలో కొత్త రూల్ తీసుకొచ్చింది. దీని ప్రకారం ముఖ్యంగా మెట్రో, అర్బన్ ఏరియాల్లో సేవింగ్స్ అకౌంట్‌లకు మినిమం బ్యాలెన్స్ రూ.10,000 నుంచి ఏకంగా రూ.50,000కి పెంచేసింది. ఈ కొత్త రూల్ ఆగస్టు 1, 2025 తర్వాత ఓపెన్ అయ్యే అన్ని కొత్త అకౌంట్‌లకు వర్తిస్తుంది. ఈ విషయం శనివారం బ్యాంక్ దీంతోపాటు సెమీ-అర్బన్, రూరల్ ఏరియాల్లో కూడా మినిమం బ్యాలెన్స్ పెంచారు. సెమీ-అర్బన్ ప్రాంతాల్లో ఇప్పటి వరకు రూ.5,000 మినిమం బ్యాలెన్స్ ఉంటే, ఇప్పుడు అది రూ.25,000కి పెరిగింది. అలాగే గ్రామీణ ప్రాంతాల బ్రాంచ్‌లలో రూ.2,500 నుంచి రూ.10,000కి పెంచారు. అంటే, ఇప్పుడు ఎక్కడైనా సరే, అకౌంట్‌లో ఎక్కువ బ్యాలెన్స్ మెయింటైన్ చేయాల్సి ఉంటుంది. మినిమం బ్యాలెన్స్‌తో పాటు, బ్యాంక్ క్యాష్ ట్రాన్సాక్షన్‌లపై కూడా కొత్త ఛార్జీలు విధించింది. ఇప్పుడు ఒక నెలలో మూడు ఫ్రీ క్యాష్ ట్రాన్సాక్షన్‌ల తర్వాత, అదనపు ట్రాన్సాక్షన్‌లకు (డిపాజిట్ లేదా విత్‌డ్రాయల్) రూ.150 వసూలు చేస్తారు. అంటే, బ్రాంచ్‌లో లేదా ఏటీఎంలో క్యాష్ డిపాజిట్ లేదా విత్‌డ్రా చేస్తే, మూడు ట్రాన్సాక్షన్‌లు ఫ్రీ, ఆ తర్వాత ఒక్కో ట్రాన్సాక్షన్‌కి రూ.150 చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాదు నాన్-బ్యాంకింగ్ అవర్స్ లలో లేదా హాలిడేస్‌లో ఏటీఎం ద్వారా క్యాష్ డిపాజిట్ చేస్తే, నెలలో టోటల్ ట్రాన్సాక్షన్ రూ.10,000 దాటితే, ఒక్కో ట్రాన్సాక్షన్‌కి రూ.50 వసూలు చేస్తారు. మెట్రోలలో ఐసీఐసీఐ కాని ఏటీఎంలలో ట్రాన్సాక్షన్‌లు చేస్తే, మొదటి మూడు ఉ




చిత ట్రాన్సాక్షన్‌ల తర్వాత, ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్‌కి రూ.23, నాన్-ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్‌కి రూ.8.50 ఛార్జ్ చేస్తారు. ఈ లిమిట్ ఫైనాన్షియల్, నాన్-ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్‌లను కలిపి కౌంట్ చేస్తారు.ఆగస్టు 1, 2025 తర్వాత కొత్తగా అకౌంట్ ఓపెన్ చేసినవాళ్లు ఈ కొత్త మినిమం బ్యాలెన్స్ రూల్స్‌ని తప్పక పాటించాలి. ఒకవేళ ఈ బ్యాలెన్స్ మెయింటైన్ చేయకపోతే, పెనాల్టీ చెల్లించాల్సి వస్తుంది. ఐసీఐసీఐ బ్యాంక్‌లో మినిమం బ్యాలెన్స్‌ని క్వార్టర్లీ బేసిస్‌లో ట్రాక్ చేస్తారు. అంటే, మీ అకౌంట్ బ్యాలెన్స్ రూ.50,000 కంటే తక్కువగా ఉన్న రోజులు (షార్ట్‌ఫాల్ డేస్) ఉన్నా, ఆ క్వార్టర్‌లో మిగిలిన రోజుల్లో ఎక్కువ బ్యాలెన్స్ మెయింటైన్ చేస్తే, సగటు బ్యాలెన్స్ లిమిట్‌లోకి వస్తే పెనాల్టీ ఉండదు. కాబట్టి, మీ అకౌంట్ బ్యాలెన్స్‌ని క్వార్టర్‌లో సరిగ్గా బ్యాలెన్స్ చేసుకుంటే సరిపోతుంది.

# టారిఫ్‌ల ప్రభావం స్వల్పమే



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్..భారత్‌పై రోజుకొక బాంబు పేలుస్తుండటంపై హైదరాబాద్, ఆగస్టు 9 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్‌పై రోజుకొక బాంబు పేలుస్తుండటంపై బ్యాంకిం గ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి స్పందించారు. ఈ ప్రతీకార సుంకాల విధించడం వల్ల భారత్‌పై స్వల్ప ప్రభావం మాత్రమే చూపనున్నదన్నారు. హైదరాబాద్‌లో బ్యాంక్ అనుబంధ సంస్థ ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్త్ ఇన్సూరెన్స్ శాఖను ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..టెక్స్‌టైల్స్, జెమ్స్ అండ్ జ్యూవెల్లరీ, సముద్రపు ఉత్పత్తులపై ప్రభావం చూపనున్నప్పటికీ మిగతా రంగాలపై పెద్దగా చూపదన్నారు. టారిఫ్‌లపై రెగ్యులేటరీలతో కలిసి పనిచేస్తున్నట్టు, త్వరలో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. ట్రంప్ టారిఫ్‌లతో ఒక భారతేకాదు ఇతర దేశా లు కూడా తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. మరోవైపు, గ్రూపునకు చెందిన ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్ అండ్ అసెట్ మేనేజ్‌మెంట్, ఎస్బీఐ మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఐపీవోకి వచ్చే అవకాశాలున్నాయని మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లలో భవిష్యత్తులో 30 బీమా శాఖలను నెలకొల్పబోతున్నట్టు ఆయన ప్రకటించారు. వీటిలో తెలంగాణలో 15, ఏపీల్లో మరో 15 శాఖలను ప్రారంభించనున్నది. ఇరు రాష్ట్రాల్లో చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి ఆరోగ్య బీమా పాలసీలు తీసుకోలేదని, వారికి అన్ని రకాలుగా సేవలు అందించాలనే ఉద్దేశంతో 2,100 హాస్పిటల్స్‌తో జట్టుకట్టినట్టు చెప్పారు. దీంతో రోగులకు అరగంటలో నగదు రహిత సేవలు అందించడానికి వీలు పడుతుందన్నారు.

## పడకేసిన ఎంఎస్‌ఎంఈ.. అమలుకాని కేంద్ర సర్కార్ పథకాలు




హైదరాబాద్, ఆగస్టు 9 : రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ(ఎంఎస్‌ఎంఈ)ల రంగం పూర్తిగా పడకేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయలోపంతో నరేంద్ర మోదీ సర్కార్ అమలుచేస్తున్న ఒక్క పథకం కూడా రాష్ట్రంలో అమలుకు నోచుకోవడంలేదు. కేంద్ర పథకాల ద్వారా ఎంతమంది ప్రయోజనం పొందుతున్నారో.. అనే విషయం అటు ఎంఎస్‌ఎంఈ అధికారులకు, ఇటు రాష్ట్ర పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులకు కూడా తెలియదంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పైరవీలు, పలుకుబడి ఉన్నవారికే సెంట్రల్ గవర్నమెంట్ పథకాల ప్రయోజనం అందుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్‌ఎస్‌ఎస్‌హెచ్ కింద ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన చిన్న పరిశ్రమలకు యంత్రాల కొనుగోలు చేసేందుకు గరిష్ఠంగా 40 శాతం సబ్సిడీతో రూ.25 లక్షల వరకు, పీఎంఈజీపీ కింద గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టుకునే వారికి 25-35 శాతం సబ్సిడీ, పట్టణాల్లో 15- 25 శాతం సబ్సిడీ, ఖాదీ గ్రామీణ ఉద్యోగ్ తదితర పథకాలు ఇందులో ముఖ్యమైనవి. అయితే, వివిధ పథకాలకు రాష్ట్రం నుంచి వేల సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రయోజనాలు అందుతున్నది మాత్రం అరకొర మందికే. సహజంగా కేంద్రం అమలుచేసే పథకాలకు రాష్ట్ర పరిశ్రమల శాఖ నోడల్ ఏజెన్సీగా ఉంటుంది. కానీ, ఈ పథకాల విషయంలో మాత్రం ప్రభుత్వ అధికారులు ఎవరికివారే అనే విధంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పరిశ్రమలకు సంబంధించిన ఏ పథకమూ సక్రమంగా అమలు కావడంలేదని పరిశ్రమ వర్గాలు ఆందోళనవ్యక్తం చేస్తుండగా.. కనీసం కేంద్ర ప్రభుత్వ పథకాలైనా అమలవుతున్నాయా.. అంటే వాటి పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు, సబ్సిడీల వివరాలపై బాలనగర్ ఎంఎస్‌ఎంఈకి చెందిన ఓ ఉన్నతాధికారిని ప్రశ్నించగా, రాష్ట్రంలో ఎంతమందికి సబ్సిడీలు వచ్చాయో చెప్పడం సాధ్యంకాదని పేర్కొన్నారు. ఇటు రాష్ట్ర పరిశ్రమల శాఖకు చెందిన ఉన్నతాధికారిని సంప్రదించగా, అసలు ఎంఎస్‌ఎంఈ శాఖ ఏమి చేస్తున్నదో తమకు తెలియదని, వారు సమాచారం ఇవ్వడంలేదని తెలిపారు. కాగా, పరిశ్రమ వర్గాలు మాత్రం ఎంఎస్‌ఎంఈ పథకాలు కేవలం పైరవీలు చేసుకునేవారికి మాత్రమే లభిస్తాయని, ఎవరికి సబ్సిడీలు వచ్చాయో అనే విషయం పక్కనున్న వారికి కూడా తెలియదని పేర్కొన్నారు. అంతా గోప్యంగా సాగుతుందని, ఈ మధ్య కాలంలో కేంద్ర సబ్సిడీలు మన రాష్ట్రానికి రావడంలేదని ఆయన చెప్పారు. తమకు తెలిసిన చాలామంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వివిధ ఎంఎస్‌ఎంఈ పథకాలకు దరఖాస్తు చేసుకున్నా ఎవ్వరికీ సబ్సిడీలు రాలేదని ఆయన ఉదహరించారు.

# 'రాజాసాబ్'... సీక్వెల్ ఉంది.. కానీ..!

# సినిమా..



ప్రభాస్ నటిస్తున్న తాజా సినిమా 'రాజాసాబ్'. మారుతీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా హార్రర్ జోనర్‌లో రానుంది. ఇందులో ప్రభాస్ రెండు విభిన్నమైన లుక్స్‌లో కనిపించనున్నారు. ప్రస్తుతం టాకీ పార్ట్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, సాంగ్స్ షూట్ వర్క్ బ్యాలెన్స్ ఉంది. తాజాగా చిత్ర నిర్మాత విశ్వప్రసాద్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ చిత్ర విశేషాలు చెప్పారు. 'ఈ సినిమా షూట్ అక్టోబర్‌కు పూర్తి అవుతుంది. మొత్తం ఈ సినిమా నాలుగున్నర గంటల ఫ్యూటేజ్ వస్తుంది. దాన్ని ఎడిట్ చేసి అక్కడడ క్కడ మ్యాచ్ చేసి మూడు గంటలు లేదా 2: 45 గంటలు అనేది డైరెక్టర్ కాల్. ఈ సినిమాలో ఫ్యాన్స్ కోరుకునే సాంగ్స్, కామెడీ, మాస్, స్టోరీ, విజువల్ గ్రాండియర్ అన్ని ఉంటాయి. ప్రభాస్ నుండి బెస్ట్ హారర్ కామెడీ సినిమా రాబోతుంది' అని అన్నారు. అలాగే రాజాసాబ్ సీక్వెల్‌పై కూడా మాట్లాడారు. 'రాజాసాబ్ 2' కచ్చితంగా ఉంది. కానీ ఆ కథకి 'రాజాసాబ్'కు సంబంధం ఉండదు. ఈ స్టోరీ కంటిన్యూ అవదు. మల్టివర్స్ టైప్‌లో రాజా సాబ్ ఫ్రాంచైజ్‌లో భారీ స్కేల్‌లో గ్రాండియర్‌గా ఉంటుంది' అని చెప్పారు.




# జక్కన్నపై ఇంట్రెస్టింగ్ రూమర్..



భారతీయ సినిమా చరిత్రలోనే దర్శకధీరుడు రాజమౌళికి ప్రత్యేక స్థానంఉంది. దాదాపు రెండు దశాబ్దాల కెరీర్ లో ఆయన ఇప్పటి వరకు 12 సినిమాలు తెరకెక్కించారు. ఇందులో అన్ని సినిమాలు బ్లాక్ బస్టర్ విజయాలు అందుకున్నాయి. సినిమాలు తెరకెక్కించ డంలో ఆయన స్క్రీన్ ప్లే, స్టోరీ టెల్లింగ్ వేటికవే సాటి. టాలీవుడ్ లో 100శాతం సక్సెస్ రేట్ ఉన్నఅతికొద్ది మంది దర్శకుల్లో ఆయన ఒకరు. ఆయన కెరీర్ లో పరాజయం అన్న మాటే లేదు. ఆయన స్క్రిప్ట్ రాసుకున్నారంటే పక్కాగా విజయం దక్కాల్సిందే.

అయితే విజువల్స్, గ్రాఫిక్స్, సీన్స్ షూటింగ్ లో మాత్రం ఆయన కాంప్రమైజ్ అవ్వరు. ఆయన అనుకున్నట్లు రాకపోతే మళ్లీ రీ షూట్ చేస్తారని, ఆయన అనుకున్నట్లు పక్కాగా ఔట్ పుట్ వచ్చేదాకా దాన్ని వదిలిపె ట్టరని ఇండస్ట్రీలో టాక్ ఉంది. అయితే ఆయన కెరీర్ లోనే ఫస్ట్ టైమ్.. స్క్రిప్ట్ ను మాడిఫై చేస్తున్నారనన్న ఇంట్రస్టింగ్ రూమర్ ఒకటి బయటకి వచ్చింది. ప్రస్తుతం ఆయన మహేశ్ బాబుతో ఎస్ఎస్ఎమ్ బీ సినిమా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ గతనెలలో కెన్యాలో జరగాల్సి ఉంది. అయితే అక్కడ రాజకీయ అనిశ్చితి కారణంగా షెడ్యూల్ క్యాన్సిల్ అయ్యింది. ఈ టైమ్ ను రాజమౌళి స్టోరీ ఎడిట్ చేయడంపై పెట్టారని టాక్. కెన్యా షెడ్యూల్ క్యాన్సిల్ అవ్వడం.. కొత్త షెడ్యూల్ ప్రారంభం కాకపోవడంతో జక్కన్నకు ప్రస్తుతం కాస్త సమయం దొరికింది. దీంతో ఈ ఫ్రీ టైమ్ లో రైటర్ కమ్ డైరెక్టర్ దేవా కట్టాతో కలిసి కొన్ని ఎపిసోడ్ లనురీ రైట్ చేయడా నికి రాజమౌళి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో ప్రియాంక చోప్రా పాత్రతో పాటు ఇంకొన్ని ఎపిసోడ్ లు ఉన్నాయట.


కాగా, నిన్న ఒక చిన్నపాటి షెడ్యూల్ ప్రారంభమైంది. చిన్న చిన్న సన్నివేశాలు ఇందులో తెరకెక్కించనున్నారు. త్వరలోనే దక్షిణాఫ్రికాలో షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్‌లో భారీ సెట్స్ తో మ హేశ్- ప్రియాంక పైన కీలక సన్నివేశాలు చిత్రీకరించనున్నారు. ఈ చిత్రంలో ప్రియాంక చోప్రాతోపాటు ఆర్.మాధవన్, పృథ్వీరాజ్ సుకు మారన్ నటిస్తున్నారు. ఈచిత్రాన్నినిర్మాత కె.ఎల్. నారాయణ రూ.800 కోట్ల భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది.



# కృతి అందాల మాయ..

లేటెస్ట్ గా కృతిశెట్టి షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో ఫ్రెష్ బ్రీజ్‌లా కనిపిస్తున్నాయి. ఫ్యాషన్ ప్రపంచంలో తనదైన మార్క్ వేసుకుంటున్న కృతి, లైట్ బ్లూ కలర్ ట్రెడిషనల్ డ్రెస్‌లో సింప్లిసిటీకి సెన్సిబిలిటీని జోడించి, స్టన్నింగ్ లుక్స్‌తో ఫ్యాన్స్‌ని ఆకట్టుకుంటోంది. ఆమె వేసుకున్న బ్యూటిఫుల్ జ్యువెలరీ, క్లోజ్ అప్ కెప్చర్స్ లో ఎక్స్‌ప్రెషన్స్‌ను ఎలివేట్ చేస్తూ, ఆమె నేచురల్ గ్లో, క్యూట్ స్మైల్ కి మిలియన్ డాలర్ అటిట్యూడ్ జతయ్యింది. ఫోటోలలో కృతి ఒకసారి మాయాజాలంలా చూస్తే, ఇంకోసారి మనసుకు హత్తుకునేలా స్మైలిస్తూ చూపించింది. ట్రెడిషనల్ దుస్తుల్లోనూ ఎంతగా స్టైలిష్ గా కనిపించొచ్చో, ప్రూవ్ చేసింది. కళ్లలో ఉన్న ఎమోషన్, ముఖంలో కనిపించే ఫ్రెష్‌నెస్ ఆమె ఫొటోలకు స్పెషల్ ఫీల్ తీసుకొచ్చింది. జువెలరీ, మేకప్, హెయిర్ స్టైల్ అన్నింటిలోనూ ఒక సాఫ్ట్ టచ్ కనిపిస్తోంది. ఫోటో గ్రఫీ, స్టైలింగ్ పరంగా కూడా ఆమె టీమ్ హైలెట్ అయింది. కృతిశెట్టి కెరీర్ విషయానికి వస్తే, ఆమె 'ఉప్పెన' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'శ్యామ్ సింగా రాయ్', 'బంగార్రాజు', 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' లాంటి సినిమాల్లో నటించి, యూత్ ఆడి యన్స్ కు చేరువ అయింది. హిట్ ఆఫర్లతో పాటు, వరుసగా స్టార్ హీరోలతో కూడా అవకాశం అందుకుంటోంది. కానీ ఇటీవల వచ్చిన కొన్ని చిత్రాలు మిక్స్‌డ్ టాక్ రావడంతో, ఆమెకు హిట్ సినిమాఅవసరం అయినపరిస్థితి కనిపిస్తోంది. ఇటీవలే మోడ్రన్ గ్లామర్ ఫోటోషూట్‌లు షేర్ చేస్తూ, యువతను, ఫ్యాషన్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది కృతి. రొటీన్ స్టైలింగ్‌కు భిన్నంగా, ట్రెడిషనల్ వేర్‌లో కూడా తనదైన మార్క్ చూపిస్తోంది. ఫ్యాన్స్ కామెంట్స్‌లో ఆమె న్యాచురల్ బ్యూటీని, నవ్వును ప్రత్యేకంగా మెచ్చుకుంటున్నారు. ఇక అప్‌కమింగ్ ప్రాజెక్ట్స్‌తో పాటు ఇలాంటి యునిక్ ఫొటోషూట్లతో కృతిశెట్టి తన మార్క్‌ను మరింత బలపర్చేందుకు ప్రయత్నిస్తోంది.

# నడకే దివ్యౌషధం




జీవనశైలిలో మార్పులు, శారీరక శ్రమ తగ్గడం వల్ల.. హృద్రోగ బాధితులు పెరుగుతున్నారు. 30 ఏండ్లకే గుండె జబ్బులను స్వాగతిస్తున్నారు. ఇలాంటివారు సరైన జీవనశైలిని పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా, నడకను దినచర్యలో భాగం చేసుకుంటే.. హృదయం తేలికపడుతుందని అంటున్నారు. రోజూ కనీసం అరగంట వాకింగ్ చేస్తే.. ఆరోగ్యాన్ని నియంత్రణలో ఉంచుకోవచ్చని చెబుతున్నారు. గుండె జబ్బు వచ్చిందంటే.. వ్యాయామానికి దూరం అవుతుంటారు. కేవలం మందులు, ఆహారంలో జాగ్రత్తలతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అనుకుంటారు. వ్యాయామం చేస్తే గుండెపై భారం పడుతుందనీ, ఇట్టే అలసిపోతామని అనుకుంటారు. కానీ, హృద్రోగులకు నడకకు మించిన వ్యాయామం లేదు. మందులు, ఆహారంతోపాటు రోజూ అరగంట నడక వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. మొదటి ఐదు నిమిషాలు చాలా నెమ్మదిగా నడవాలి. దీంతో వ్యాయామానికి శరీరం సిద్ధమవుతుంది. నిదానంగా వేగాన్ని పెంచుకుంటూ పోవాలి. మళ్లీ వేగాన్ని నెమ్మదిగా తగ్గించుకుంటూ రావాలి. అలాకాకుండా ఒకేసారి నడక వేగాన్ని తగ్గిస్తే.. తలతిరగడం లాంటి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంటుంది. ఎక్కువ వేగంతో తక్కువ దూరం నడవడం కన్నా.. తక్కువ వేగంతో ఎక్కువ దూరం నడిస్తే మంచి ఫలితం ఉంటుంది. కడుపు నిండా తిన్న తర్వాత వాకింగ్ చేయడం అంతమంచిది కాదు.నడక వల్ల గుండె వేగంతోపాటు శ్వాసరేటు క్రమబద్ధంగా పెరుగుతుంది.

# బిగ్ బాస్ సీజన్ 9..

## పోటీ మాములుగా ఉండదు మరి..!



బుల్లితెర ప్రేక్షకులకి మంచి వినోదం పంచుతున్న బిగ్ బాస్ రియాలిటీ షో సక్సెస్ ఫుల్‌గా ఎనిమిది సీజన్స్ పూర్తి చేసుకుంది. మరి కొద్ది రోజులలో సీజన్ 9మొదలు కానుండగా, ఇప్పటికే ప్రమోషన్స్ మొదలు పెట్టారు. ఇటీవల పలు వీడియోలు విడుదల చేసి షోపై ఆసక్తి పెంచే ప్రయత్నం చేశారు. సెప్టెంబర్ 2025లో ఈ సీజన్ ప్రారంభం కానుండగా, ప్రస్తుతం షోకు సంబంధించి సన్నాహాలు చేస్తున్నారు. షోకి హోస్ట్‌గా కింగ్ నాగార్జుననే కొనసాగనున్నారని అధికారికంగా వెల్లడించారు. తాజా సమాచారం ప్రకారం, మేకర్స్ ఈ సీజన్‌లో కొన్ని కీలక మార్పులు చేస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా సీక్రెట్ రూమ్, రీ-ఎంట్రీ వంటి పాత కాన్సెప్ట్‌లను తప్పించాలన్న ఆలోచనలో ఉన్నారు. వీటి బదులుగా కొత్త మైండ్ గేమ్స్, ఇంటెన్స్ డ్రామా అంశాలపై ఎక్కువగా ఫోకస్ చేయనున్నారు. ఎలిమినేషన్ ప్రాసెస్‌కి సంబంధించి కూడా కొన్ని నూతన నియమాలు ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. గత సీజన్‌లో శారీరక శ్రమ ఎక్కువగా ఉండటం వలన,కొందరు కంటెస్టెంట్లకు ఒత్తిడికి గురైనట్టు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఈ సీజన్‌లో మానసిక స్థైర్యం, వ్యక్తిత్వ ప్రదర్శన, సామాజిక పరిపక్వత వంటి అంశాలపై ఎక్కువగా ఆధారపడే టాస్కులు ప్లాన్ చేస్తున్నారు. సెలబ్రిటీలతో పాటు సామాన్యులని సైతం ఈసారి బిగ్ బాస్ షోలోకి తీసుకోబోతున్నట్టు తెలుస్తుంది. బిగ్ బాస్ తెలుగు 9 మునుపటి సీజన్లను మించేలా మేకర్స్ ప్రత్యేక కసరత్తు చేస్తున్నారు. బిగ్ బాస్ షోలో పాల్గొనే కంటెస్టెంట్ల జాబితాలో రీతూ చౌదరి పేరు హైలెట్ అవుతోంది. ఆమెకు ఒకింత భారీ స్థాయిలోనే రెమ్యునరేషన్ ఆఫర్ చేశారని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్. నవ్య స్వామి, సుమంత్ అశ్విన్, జ్యోతి రాయ్ లతో పాటు కల్పికా గణేష్, తేజస్విని గౌడ, అలేఖ్య సిస్టర్స్ లో ఒకరు, ఆర్జే రాజ్, శ్రావణి వర్మ, సాయికిరణ్, దీపికా, ఈకనాథ్, దెబ్జానీ, మరి కొందరు ప్రముఖ సెలబ్రిటీలు ఈ షోలో పాల్గొనే ఛాన్స్ అయితే ఉంది.



# బాధ్యతల్లో బందీ..!

కార్పొరేట్‌సంస్థల విజయాల్లో మహిళా నాయకులు కీలకపాత్ర పోషిస్తున్నారు. అదే సమయంలో.. వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం లో మాత్రం వెనకబడి పోతున్నారు. నాయకత్వ బాధ్యతల్లో ఉన్న మహిళలు.. ఆ విధుల్లో బందీలుగా మారుతున్నారు. అనేక మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారు. ఈ విషయాలను పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. సంస్థల అభివృద్ధి కోసం కృషిచేస్తున్నవారి శ్రేయస్సును కార్పొరేట్ సంస్థలు గాలికి వదిలేస్తున్నాయని విమర్శిస్తున్నాయి. కార్పొరేట్ సంస్థలను విజయతీరాలకు చేర్చాలంటే ఎన్నో అడ్డంకులను అధిగమించాలి. మరెన్నో సవాళ్లను ఎదుర్కోవాలి.

ఈక్రమం లో నాయకత్వ స్థానాల్లో కీలకంగా ఉన్న మహిళలు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారట. ఈసమస్య కంటికికనిపించకుండా.. చాపకి ంది నీరులా విస్తరిస్తున్నదట. ఫలితంగా, లేడీబాస్‌లు ఎక్కువగా బర్న్ అవుట్ అవుతున్నారు. ఈ సంక్షోభం.. భవిష్యత్తులో తీవ్రమైన దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉన్నదని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం.. మహిళలు ద్విపాత్రాభి నయం చేయడమేనని చెబుతున్నారు. నాయకత్వ స్థానాల్లో ఉన్న మహి ళలు.. వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడంతోపాటు ఊపిరి సలపని పనులతో సతమతం అవుతుంటారు.

అదే సమయంలో ఇంటి బాధ్యతల ను కూడా నిర్వహిస్తుంటారు. ఇక పురుషులతో పోలిస్తే.. మహిళా నాయకులపైనే అధిక అంచనాలు ఉంటున్నాయి. ఈ కారణం కూడా వారిపై ఒత్తిడిని పెంచుతున్నదని ప్రముఖ కన్సల్టింగ్ సంస్థలు నిర్వహించిన అధ్యయనాల్లో తేల్చాయి. ఉన్నత స్థానాల్లో ఉండే పురుషుల్లో 31శాతం మంది మెంటల్లీ బర్న్ అవుట్ అవుతుండగా.. మహిళల వాటా 43 శాతం ఉన్నదని వెల్లడిస్తున్నాయి. పెద్దస్థాయిలో పని ఒత్తిడిని ఎదుర్కొంటున్న మహిళల్లో హృద్రోగాలు వచ్చే అవకాశం 50% ఎక్కువగా ఉన్నదని తేలింది. ఆందోళన, నిరాశలో కూరుకుపోయే ప్రమాదం పురుషులతో పోలిస్తే.. 1.6 రెట్లు ఎక్కువట. అధిక ఒత్తిడితో పనిచేసే మహిళల్లో నిద్రలేమి, జీవక్రియలు మందగించడం, రోగ నిరోధక వ్యవస్థ పనితీరు కూడా తగ్గే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

Edited, Published & Owned by KACHAM SATYANARAYANA. Printed at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS, #3-63, THANEDHARPALLE, GHANPUR STATION MANDAL, THANEDHARPALLE, WARANGAL, TELANGANA - 506143. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | RNI No: TGTEL/25/A1676, Email: vishwambhara.daily@gmail.com